



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 102 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 22 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 102 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 22 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ పెన్ పవర్:తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

- మిగతా 2లో

## ఏఐసీసీ అంటే 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్'

- ఏఐసీసీకి కొత్త అర్థం చెప్పిన బండి సంజయ్
- కాంగ్రెస్ ఒక కుటుంబం నడిపే మోసపూరిత కంపెనీ అని విమర్శ
- నటన నేర్చుకున్నాకే సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చారని ఆరోపణ
- అవినీతి కేసుల్లో ఉన్నవారు నీతులు చెప్పడం హాస్యాస్పదం అన్న సంజయ్
- తమది అందరి అభివృద్ధి విధానమని, కాంగ్రెస్‌ది బుజ్జగింపుల రాజకీయమని వ్యాఖ్య

- మిగతా 2లో





## కామారెడ్డి లో హైటెన్షన్





### షబ్బీర్‌అలీ VS ఎమ్మెల్యే కాటిపల్లి

- వెంకట రమణారెడ్డి హౌస్ అరెస్ట్
- కాంగ్రెస్ నేత మహేందర్రెడ్డి కారు ధ్వంసం
- తోపులాటలో పోలీసులకు గాయాలు
- భూ కబ్జాలపై కాంగ్రెస్, బీజేపీ ఆరోపణలు
- బహిరంగ చర్చకు ఇరుపార్టీల సవాళ్లు, ప్రతి సవాళ్లు

హైదరాబాద్ పెన్ పవర్:కామారెడ్డిలో హైటెన్షన్ నెలకొంది. డిగ్రీ కాలేజీ ఆస్తుల విషయమై సవాళ్లు, ప్రతి సవాళ్లు ఉద్రిక్తతకు దారి తీశాయి. కాలేజీ ఆస్తుల విషయమై తాను ఉదయం చర్చకు వస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రకటించారు. సా క్ష్యాలతో రావాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఇదే క్రమంలో కొన్ని పత్రాల తోకాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్కాలే

- మిగతా 2లో

### కరప్షన్ కింగ్ వెంకటరమణారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈ నెల 16న మీడియాతో మాట్లాడుతూ.. "ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు ఓ ప్రైవేట్ పాఠశాల, కళాశాలకు అమ్ముకున్నది ఎవరు?.. రూ.6 కోట్లకు అరోరా కాలేజీకి అమ్ముకున్నది బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కాదా? గతంలో నేనే మున్సిపల్ కౌన్సిలర్ అవకాశం ఇస్తే ఆయన ఓడిపోయారు. జడ్పీటీసీగా అవకాశం ఇస్తే గెలిచారు. వెంకటరమణారెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్ గా చేసినప్పుడు నాకు జన్మనిచ్చింది నా తండ్రి అయితే రాజకీయంగా జన్మనిచ్చింది సబ్బీరన్న అన్నడు. 2015 ఎమ్మెల్సీ ఎన్నికల్లో నా చేతుల మీదుగా బీఫామ్ ఇస్తే చివరి నిమిషంలో టికెట్ అమ్ముకుని విత్ డ్రా చేసుకుని పారిపోయిండు" అని ఆరోపించారు.

### నువ్వు బీరో షబ్బీరో తేలుకుందాం రా!

షబ్బీర్ అలీ ఆరోపణలపై వెంకటరమణారెడ్డి కూడా అదే స్థాయిలో స్పందించారు. ఈద్గా వద్ద కూర్చుందామా? ఎక్కడైనా కూర్చుందాం రా చర్చకు రా? నేను నా కుటుంబాన్ని తీసుకుని వస్తా... షబ్బీర్ కు దమ్ము ధైర్యం ఉంటే ఆయన కుటుంబాన్ని తీసుకొని రావాలె. ఎమ్మెల్సీగా నేను నా నామినేషన్ విత్ డ్రా చేసుకుంటే ఎవడు డబ్బులు ఇచ్చాడో తేల్చుదాం. నేను ఎప్పుడు ఇలా మాట్లాడలే.. నా మంచితనాన్ని అమాయత్వం, నా చేతగానితనంగా భావిస్తున్నారు. రేపటి నుంచి అన్యాయంగా ఎవరు మాట్లాడినా వాళ్ల వీపులు పగలగొట్టండి. ఇక్కడి నుంచి ఏ పోలీస్ స్టేషన్ కైనా నేనే వస్తా. చూస్కో పబ్బీర్.. నువ్వు బీరో... షబ్బీరోనీ సంగతి చూడకపోతే నా పేరు వెంకటరమణారెడ్డి కాదు. నేను రెడ్డినో బుడ్డినే చూపిస్తా' అంటూ చర్చకు సవాలు విసిరారు




## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

### మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో

వెంకయ్యనాయుడు ఆందోళన

- విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి
- మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు
- భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు

- మిగతా 2లో




## చంచల్ గూడ జైలులో ఉగ్ర కుట్ర జరగలే.. ఆ వార్తలన్నీ ఫేక్

- చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్ర.. స్పందించిన పోలీసు అధికారి
- ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులే అన్న డీఐజీ
- జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో నిజానిజాలు తెలుసుకోవాలని సూచన
- ప్రముఖ ఛానల్లలో ప్రచారం జరిగితే ప్రజలు భయాందోళనకు గురవుతారన్న డీఐజీ

- మిగతా 2లో

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- అక్రమ వలసదారులను ఓటరు జాబితా నుంచే కాదు దేశం నుంచి తొలగిస్తామన్న అమిత్ షా
- అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్న అమిత్ షా
- కానీ కాంగ్రెస్‌కు వారే ఓటు బ్యాంకు కాబట్టి పంపించలేరని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదా రులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని,

- మిగతా 2లో



## భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

- యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్

- మిగతా 2లో






## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం
- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం

హైదరాబాద్ పెన్ పవర్:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంత ర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించు కోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని

- మిగతా 2లో

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

- కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా
- ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు
- కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం

- మిగతా 2లో



## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

### ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన



- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య

- మిగతా 2లో



## అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే మేలు జరుగుతుంది

- ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను సందర్శించిన హరీశ్ రావు
- తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్
- రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మారుతున్న కాలంలో మసకబారుతున్న మనుగడ

దేశ ప్రజల ఆర్థిక సామాజిక ప్రగతికి, ఒక జాతి అన్ని కోణాల్లోనూ అభివృద్ధి చెందడానికి విద్యతో పాటు వైద్య ఆరోగ్యరంగం కూడా ముఖ్యమని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ, మన దేశంలో ఈ అంశాలే అత్యంత నిర్లక్ష్యానికి గురవుతుండటం బాధాకరం. మన మానవ వనరుల పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పడానికి ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) వెల్లడించిన గణాంకాలే నిదర్శనం. ఐదేండ్లలోపు చిన్నారుల్లో 67 శాతం, 15 నుంచి 49 సంవత్సరాల మహిళల్లో 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని వెల్లడించింది. ఈ లెక్కలు పదేండ్లపైన నిరాటంకంగా పాలిస్తున్న కేంద్రపాలకులకు చెంపపెట్టు లాంటిది. అయినా మన దేశాధినేతలు దేశం ప్రపంచ ఆర్థిక పటంలో వేగంగా ఎదుగుతోందని, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పుకోవడం మాత్రం సిగ్గుచేటు.పిల్లల్ని కనే వయసున్న మహిళల్లో రక్తహీనత గత పదేండ్లలో నాలుగు శాతం పెరిగిందని సర్వేలో వెల్లడైంది. తల్లి ఆరోగ్యం బలహీనమైతే కుటుంబ ఆరోగ్యం దెబ్బతింటుంది; గర్భిణీల్లో రక్తహీనత ఉంటే తక్కువ బరువుతో పుట్టే శిశువులు, శిశుమరణాలు పెరుగుతాయి. ఈ పరిస్థితి తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. పేదరికం వల్ల సరైన పోషకాహారం లేకపోవడమూ సమస్య ను మరింత పెంచుతున్నాయి. చిన్నారి జీవితం లోనూ తొలి ఐదేండ్లు శారీరక, మానసిక, మేధో అభివృద్ధికి అత్యంత కీలక దశ. ఈ సమయంలో ఏదీ తగ్గినా తరచూ అనారోగ్యానికి గురవుతారు. దీని ప్రభావం పాఠశాల విద్య నుంచి భవిష్య త్తు ఉపాధి అవకాశాల దాకా ఉంటుంది. ఈ సమస్యను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తాము అధికారంలోకి రాగానే అందరికీ తిండి, ఆరోగ్యం, వైద్యం, వైద్యం, కనీస మౌలిక సదుపాయాలు అందిస్తామని చెప్పినప్పటికీ, అదే బాటలో బీజేపీ కూడా నిర్లక్ష్యం చేస్తోందని గణాంకాలను బట్టే అర్థమవుతోంది.పదేండ్లు దాటినా ఇప్పటికీ రక్తహీనతతో బాధపడేవారు, చనిపోయే వారి సంఖ్య పెరుగుతోంది తప్ప తగ్గడంలేదు. 2019లో ఎనీమియా ముక్త్ భారత్ (ఎఎంబి) పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టినా... ఉపయోగం లేకపోగా, అమలే సరిగా లేదు. ప్రజా ఆరోగ్య వ్యవస్థపై పెట్టుబడులు తగినంతగా లేకుండా మాతా శిశువులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఎన్ని ప్రకటనలు చేస్తే లాభం? ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, పప్పులు, నూనెలు, ప్రోటీన్ వనరులు అందుబాటులో ఉంచడం, అంగన్‌వాడీ సేవలను విస్తరించడం, ఆశా కార్యకర్తలను పెంచడం ప్రధానం. ఇంకా చెప్పాలంటే ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయాన్ని గణనీయంగా పెంచడం వంటి నిర్మాణాత్మక చర్యలు చాలా అవసరం. ఇవి చేయకుండా రక్తహీనత ఎలా తగ్గుతుంది?పన్నెండేండ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ పాలనలో కార్పొరేట్ కేంద్రీకృత ఆర్థిక విధానాలు వేగవంతమయ్యాయి; భారీ మౌలికవసతుల ప్రాజెక్టులు, కార్పొరేట్ పన్ను రాయితీలు, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ జరుగుతోంది. కార్పొరేట్లకు ఉపయోగపడే విధానాలు తప్ప పేదలకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాలను పటిష్టం చేయడం లేదు. ప్రజల పోషకాహార భద్రత, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా వదిలేసింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల సరఫరా నిరంతరాయంగా లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షణ బలహీనంగా ఉండటం, అంగన్‌వాడీ వ్యవస్థకు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వంటివి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ నిధులు తగ్గించి రాష్ట్రాలపై భారం మోపడం, మధ్యాహ్న భోజనం పథకాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులు తగ్గించడం వంటి అంశాలు మాతాశిశువుల్లో రక్తహీనతకు కారణమవుతున్నాయి.రక్తహీనతను తగ్గించడం అనేది కేవలం ఆరోగ్య సూచిక మెరుగుదల కాదు, అది దేశ మానవ మూలధనాన్ని బలోపేతం చేసే పెట్టుబడి. ఆర్థికంగా శక్తివంతమైన దేశం కావాలంటే ఆరోగ్యంగా, పోషకాహారంతో నిండిన భారత్ కావాలి. గణాంకాలు హెచ్చరికగా మారిన ఈ దశలో ప్రభుత్వం, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా కదలకపోతే అభివృద్ధి అంకెల్లో మాత్రమే కనిపిస్తుంది గానీ ప్రజల జీవితాల్లో ప్రతిఫలించదు. బియ్యం, గోధుమల పంపిణీతో మాత్రమే సమస్య పరిష్కారం కాదు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటి పోషకాలను ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి. ప్రజల ఆరోగ్యం, పోషకాహారం, గౌరవప్రద జీవనోపాధి హక్కుగా స్థాపించబడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం. 'అందరికీ ఆరోగ్యం' నినాదాన్ని సాకారం చేయాలంటే ఆరోగ్య వ్యవస్థను మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేసే విధానాలను పాలకులు విడనాడాలి.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- మొదటి పేజి తరువాయి

నిర్దేశిస్తోం ది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది.
అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowerment)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Development)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

– మొదటి పేజి తరువాయికాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు.డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు.
ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

# ఏఐసీసీ అంటే 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్'

కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఐసీసీ అంటే 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ' కాదని, 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్' అని ఆయన కొత్త నిర్వచనం ఇచ్చారు. ఢిల్లీ నుంచి తెలంగాణ వరకు కాంగ్రెస్ నేతలకు ప్రజలకు సేవ చేయడంపై కాకుండా, నటించడంపైనే శిక్షణ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇచ్చిన 420 హామీలను అమలు చేసినట్లు, తీవ్రమైన భావోద్వేగంతో ఉన్నట్లు కాంగ్రెస్ నాయకులు నటిస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న డీసీసీ శిక్షణా తరగతులు పాలనపై సమీక్షల్లా కాకుండా, నటన నేర్పే వర్క్‌షాప్‌ల వలే ఉన్నాయని బండి సంజయ్ విమర్శించారు. నిజంగా ప్రజలకు సేవ చేసి ఉంటే ఈ రిహార్సల్స్ అవసరం ఉండేది కాదని, మార్పును ప్రజలే నేరుగా గమనించేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్క్రిప్ట్ ఎప్పుడూ ఒకేలా ఉంటుందని, అందులో గాంధీ కుటుంబమే హీరో అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఒకే కుటుంబం యాజమాన్యంలో నడిచే షెల్ కంపెనీగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. త్యాగాల గురించి మాట్లాడే ఈ మోసపూరిత కంపెనీ, నిజాయతీ గురించి దొంగలు నీతులు చెప్పినట్లుగా ఉందని అన్నారు. ఆ పార్టీ యజమానులు అవినీతి కేసులు, చట్టపరమైన విచారణలను ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో కాంగ్రెస్, గాంధీ కుటుంబంపై భిన్నంగా మాట్లాడారని, కానీ కాంగ్రెస్ యాక్టింగ్ క్లాసుల్లో చేరిన తర్వాత ఆయన కూడా మాట మార్చారని సంజయ్ విమర్శించారు. ఇప్పుడు గాంధీ కుటుంబమే త్యాగాలు చేసిందంటూ పాత పాటే పాడుతున్నారని అన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి, న్యాయవ్యవస్థను
బలహీనపరిచిన కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. లక్షలాది మంది భారతీయుల త్యాగాలను విస్మరించి, స్వాతంత్ర్య పోరాటానికి ఒకే కుటుంబం రాయల్టీ క్లెయిమ్ చేస్తోందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాలు ఏటీఎం యంత్రాల్లా కనిపిస్తాయని, కానీ బీజేపీకి మాత్రం అవి అభివృద్ధి యంత్రాలుగా కనిపిస్తాయని బండి సంజయ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే నిబద్ధతతో పాలన సాగుతోందని తెలిపారు. అందరి కోసం అభివృద్ధి, ఎవరికీ బుజ్జగింపులు ఉండవన్నదే తమ విధానమని ఆయన స్పష్టం చేశారు.

## చంచల్ గూడ జైలులో ఉగ్ర కుట్ర జరగలే.. ఆ వార్తలన్నీ ఫేక్

హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్రణాళికలు రచించారనే ప్రచారంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలు, కొన్ని ఛానళ్లలో చంచల్‌గూడ జైలు నుంచి ఉగ్రకుట్ర అని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు.జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏదైనా విషయాన్ని ప్రసారం చేయడానికి ముందు నిజానిజాలు ధృవీకరించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మీడియా ఛానళ్లు ఇలాంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ప్రముఖ ఛానళ్లలో ఇలాంటి వార్తలు వస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని అన్నారు. ప్రజల్లోని ఆందోళన తొలగించడానికే
ఈరోజు మీడియా ముందుకు వచ్చామని అన్నారు. చంచల్‌గూడ జైల్లో లష్కరేకు చెందిన ఉగ్రవాది ఒక్కడే ఉన్నాడని తెలిపారు. అతనికి కూడా భార్యతో తప్ప ఎవరితోనూ ములాఖత్ లేదని స్పష్టం చేశారు.

# కామారెడ్డి లో హైటెన్షన్

- మొదటి పేజి తరువాయి

గ్రౌండ్ వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డిని పోలీసులు క్యాంప్ ఆఫీస్ లోనే హౌస్ అరెస్టు చేశారు. ఆయన క్యాంప్ ఆఫీసు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నాయకుడు మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వైపు దూసుకు వచ్చారు. క్యాంప్ ఆఫీసు లోకి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు ఆయన కారుపై దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. కారుకు నిప్పంటించారు. కాంగ్రెస్ నాయకుడు మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

**ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్**

తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జరిగిన తోపులా టలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో పోలీసులు అప్రమత్తమయ్యారు

# అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే మేలు జరుగుతుంది

- మొదటి పేజి తరువాయి

సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు.సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు.ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

# 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకె ళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రా ష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు.
సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.
తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..

## రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.
వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి.ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

# భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది.ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- మొదటి పేజి తరువాయి

కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు.చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

# ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ స్పందన

- అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు
- ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య
- ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన



హైదరాబాద్ పెన్ పవర్:ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు.రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

# పెన్ పవర్



## తెలంగాణ రౌండప్



## 5 లక్షల ఇళ్లు మంజూరు

# చేయండి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



హైదరాబాద్ పెన్ పవర్:పస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో రాష్ట్రానికి కనీసం 3 లక్షలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 లక్షలు కలిపి మొత్తం 5 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయనతో పొంగులేటి సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్రానికి కేటాయించాల్సిన ఇళ్లపై వినతిపత్రం సమర్పించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే మూడేళ్లలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటిని నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 4 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం సహకారం అందిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుంది. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి రావాల్సిన ఇళ్లను దృష్టిలో పెట్టుకుని మొత్తం 5 లక్షల ఇళ్లను మంజూరు చేయాలి' అని కేంద్రమంత్రికి పొంగులేటి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ పాల్గొన్నారు.

# దుండిగల్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం..


మూడు వేర్వేరు ప్రాంతాల్లో భారీ కూల్చివేతలు..

గతంలో ఉద్రిక్తతల ఘటనల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు మధ్య చర్యలు..

రెండు చెరువుల ఆక్రమణలు..! మరోచోట ప్రభుత్వ భూమి కబ్జాల కూల్చివేతలు..



- ఫీర్జాదికుంట లేక్ఐడి నెం.2855 సర్వే నెం.141లో అక్రమ నిర్మాణాల కూల్చివేత..
- బాబాఖాన్ లేక్ఐడి నెం.2856 చెరువు బఫర్ జోన్ సర్వే నెం.76లో జేసీబీతో చర్యలు..
- సర్వే నెం.454 ప్రభుత్వ భూమిలో కాంపౌండ్ వాల్ తొలగించిన అధికారులు..
- రెవెన్యూ-ఇరిగేషన్-మున్సిపల్ జాయింట్ ఇన్‌స్పెక్షన్‌తో చర్యలు..
- గతంలో ఉద్రిక్తతల ఘటనలు దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు..



**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** చెరువులు, కుంటలు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.. భవిష్యత్తు లోనూ మళ్ళీ ఇలాంటి అక్రమాలు పునరావృతం అయితే, నిరంతర చర్యలు కొనసాగుతాయని మూడు శాఖల అధికారులు హెచ్చరించారు.. వివరాల్లోకి వెళ్ళితే..! దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని చెరువులు, కుంటలు ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఉక్కుపాదం మోపారు.. దుండిగల్ సర్కిల్ పరిధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన కూల్చివేతలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ఈ చర్యలు చేపట్టారు..

-4లో

## పరామర్శకు బయలుదేరితే..

# హౌస్ అరెస్ట్..

ప్రజాస్వామ్యాన్ని బందీ చేసిన ప్రభుత్వం:ఎంపి ఈటల రాజేందర్..!

- కామారెడ్డి దాడి నేపథ్యంలో బయలుదేరిన ఎంపీని అడ్డుకున్న పోలీసులు..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసిన ఎంపి ఈటెల రాజేందర్..



- మిగతా 6లో...



ఆదాయానికి మించిన ఆస్తులు..

# కల్వకుర్తి ఏడీఏ ఇంట్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్ పెన్ పవర్: నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి ఏడీఏగా పనిచేస్తున్న సుందర్ కిరణ్ కుమార్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. పొనుగోడు గ్రామంలోని ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం ఏడు ప్రాంతాల్లో దాడులు చేపట్టినట్లు అధి కారులు వెల్లడించారు. గడ్డిపల్లి గ్రామంలోని బంధువుల ఇల్లు, అనంతగిరి మండలంలోని అమీనాబాద్, తుక్కుగూడతో పాటు నేరేడుచర్ల మండలం చిల్లపల్లి వద్ద ఆయనకు భాగస్వామ్యం ఉన్న రైస్ మిల్, కల్వకుర్తిలోని ఇతర ఆస్తులపై సోదాలు కొనసాగినట్లు సమాచారం. గతంలో

-4 లో

# గండిమైసమ్మలో 'డబుల్ బెడ్రూమ్' దుమారం..!

నోటీసుల పేరుతో పేదలపై ఒత్తిడి..? ఎంపీ ఈటల రాజేందర్ జోక్యం..!

- కలెక్టర్ ఎంక్వయిరీ అంటూ నివాసులకు షాక్ నోటీసులు..!
- 'ప్లాట్ ఉంది, కార్ ఉంది' అంటూ ఇల్లు రద్దు చేస్తామని హెచ్చరికలు..
- ఎంపీ ఎదుట మహిళలు కన్నీటి పర్యంతం..! "ఈఇల్లే తమకు దిక్కంటూ ఆవేదన వ్యక్తం..
- వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి విషయాన్ని ప్రస్తావించిన ఈటెల..
- "ధైర్యంగా ఉండండి, నేనున్నాను" అంటూ ఎంపి ఈటల భరోసా..
- మూడేళ్లుగా పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్న డబుల్ బెడ్ రూమ్ వాసులు..
- అకస్మాత్తుగా ఈ నోటీసుల చర్యలపై అనుమానాలు..
- వసతులు కల్పించని కాలనీకి నోటీసులు..? రాజకీయ నాటకమా..?: బీజేపీ విమర్శలు..



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన మూడేళ్ళ తరువాత లబ్దిదారులకు నోటీసులు జారీ చేయడం, హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.. కలెక్టర్ సమక్షంలో, కంప్యూటరైజ్డ్ ద్వారా లబ్దిదారుల ఎంపిక పారదర్శకత, అధికారుల పనితీరునే, వక్రీకరించే విధంగా ఉందని బీజేపీ నేతలు ఎద్దేవా చేశారు.. మూడేళ్ళకు లబ్దిదారులను అర్హులు కాదంటూ నోటీసులు ఇవ్వడం, ఎంపిక ప్రక్రియను తప్పు పడుతున్నారా..? అసలు ఎవరి ఆదేశాలతో అర్థాంతరంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను, కలిసిన బాధిత మహిళలు బోరున విలపించి తమగోడును వినిపించారు.. స్పందించిన ఎంపి బాధితుల తరపన కలెక్టర్‌తో మాట్లాడారు..

దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 21:

-6 లో






# మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి




హైదరాబాద్ పెన్ పవర్:: మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.





# దుండిగల్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



**మూడు వేర్వేరు ప్రాంతాల్లో భారీ కూల్చివేతలు..**

**గతంలో ఉద్రిక్తతల ఘటనల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు మధ్య చర్యలు..**

**రెండు చెరువుల ఆక్రమణలు..! మరోచోట ప్రభుత్వ భూమి కబ్జాల కూల్చివేతలు..**

- ఫీర్జాదికుంట లేక్ఐడి నెం.2855 సర్వే నెం.141లో అక్రమ నిర్మాణాల కూల్చివేత..
- బాబాఖాన్ లేక్ఐడి నెం.2856 చెరువు బఫర్ జోన్ సర్వే నెం.76లో జేసీబీతో చర్యలు..
- సర్వే నెం.454 ప్రభుత్వ భూమిలో కాంపౌండ్ వాల్ తొలగించిన అధికారులు..
- రెవెన్యూ-ఇరిగేషన్-మున్సిపల్ జాయింట్ ఇన్‌స్పెక్షన్‌తో చర్యలు..
- గతంలో ఉద్రిక్తతల ఘటనలు దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు..

**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** చెరువులు, కుంటలు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.. భవిష్యత్తు లోనూ మళ్ళీ ఇలాంటి అక్రమాలు పునరావృతం అయితే, నిరంతర చర్యలు కొనసాగుతాయని మూడు శాఖల అధికారులు హెచ్చరించారు.. వివరాల్లోకి వెళ్ళితే..! దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని చెరువులు, కుంటలు ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఉక్కుపాదం మోపారు.. దుండిగల్ సర్కిల్ పరిధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన కూల్చివేతలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ఈ చర్యలు చేపట్టారు..

## దుండిగల్ సర్వే నెం.454 ప్రభుత్వ భూమిలో..

దుండిగల్ మండల పరిధిలోని సర్వే నెంబర్ 454 ప్రభుత్వ భూమి, పల్లవి ఆశ్రమం సమీపంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శనివారం జేసీబీ కూల్చివేశారు.. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. ప్రభుత్వ భూమిలో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించినట్లు తెలిపారు. ఆర్ఐ రవి కుమార్ సిబ్బంది ఈ కూల్చివేతల్లో పాల్గొన్నారు

## ఫీర్జాదికుంట లేక్ఐడి నెం.2855 చెరువు బఫర్ కబ్జా..!

దుండిగల్ గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి ఫీర్జాదికుంట లేక్ఐడి నెం.2855, సర్వే నంబర్ 141లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు శనివారం తొలగించారు.. స్థానికుల ఫిర్యాదులపై స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పరిశీలన అనంతరం, సంబంధిత నిర్మాణాలు కబ్జాకు గురైనట్లు నిర్ధారించారు.. దీంతో ఇరిగేషన్ డీఈ జైపాల్, దుండిగల్ మండల తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు, చర్యలు చేపట్టారు.. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాస్ పర్యవేక్షణలో, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఆర్ఐ రజనీకాంత్ సమక్షంలో జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.. ఈ కూల్చివేతలకు దుండిగల్ ఇన్‌స్పెక్టర్ పి.సతీష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు..



## బాబాఖాన్ లేక్ఐడి నెం.2856 చెరువు బఫర్ జోన్ కబ్జా..

బహుదూర్‌పల్లి విలేజ్ బాబాఖాన్ లేక్ఐడి నెం.2856 చెరువు బఫర్ జోన్‌లోని సర్వే నెంబర్ 76లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూడా శనివారం అధికారులు తొలగించారు. చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం "హైడ్రా" పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠ పరిచి, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినా, కబ్జాదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు తెలిపారు..

ఈ నేపథ్యంలో మూడు శాఖలు సంయుక్త తనిఖీ అనంతరం అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ కావడంతో, భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు నిర్వహించారు.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశముండటంతో(గతంలో ఘటనల దృష్ట్యా) దుండిగల్ ఇన్‌స్పెక్టర్ పి.సతీష్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు..



---

## ఆదాయానికి మించిన ఆస్తులు.. కల్వకుర్తి ఏడీఏ ఇంట్లో ఏసీబీ సోదాలు

-3 పేజి తరువాయి

ఆయన సూర్యాపేట జిల్లా డీఆర్డీఏ పీడీగా పనిచేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదు లు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మహబూబ్నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలపై పరిశీలన కొనసాగుతోందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రాజకీయ అండదండలతో అగ్రికల్చర్ డి పార్ట్మెంట్ నుంచి డిప్యూటేషన్ పై సూర్యాపేట జిల్లాకు వచ్చి చాలా అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.

## సంగారెడ్డి జైలులో బీఆర్ఎస్ నేతలను పరామర్శించిన హరీష్ రావు

**సంగారెడ్డి: పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా జైలులో రిమాండ్లో ఉన్న 13 మంది బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ మంత్రి హరీష్ రావు శనివారం పరామర్శించారు. .

ఈ సందర్భంగా జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో గెలవలేక, పోలీసు లాఠీలతో, అక్రమ కేసులతో నెగ్గాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోంది. దానికి నిదర్శనమే ఈ 13 మంది కార్యకర్తల అక్రమ అరెస్టని అన్నారు.

మెదక్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి అత్యధిక వార్డులు వచ్చాయి. అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు రోజు అర్ధరాత్రి 12:30 గంటలకు, ప్రచార గడువు ముగిసిన తర్వాత, నాలుగు కార్ల కాన్వాయ్తో వార్డుల్లో ఎందుకు తిరిగారు? ఇది ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కాదా?రాత్రిపూట దౌర్జన్యంగా ఒక ముస్లిం మహిళ ఇంటికి వెళ్లి, ఆమెను బెదిరించి, బట్టలు చింపే ప్రయత్నం చేసి ఎమ్మెల్యే గన్మెన్ దాడి చేశాడు. ఆ అన్యాయాన్ని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలపైనే తిరిగి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం కాంగ్రెస్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనం. కనీసం మెడికల్ రిపోర్ట్ లేకుండా 307 కేసు ఎలా నమోదు చేస్తారు? పోలీసులు గుడ్డిగా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు.

ఈ అక్రమ కేసులకు బాధ్యత వహిస్తూ భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు. అర్ధరాత్రి కాన్వాయ్తో తిరిగిన ఎమ్మెల్యే వాహనాలను ఎందుకు సీజ్ చేయలేదు? అక్కడే ఉన్న డీఎస్పీ డబ్బులు పంచుతుంటే ఎందుకు అడ్డుకోలేదు? ఘర్షణ సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కారు ఎక్కించిన వారిపై, ఆటోపై పెట్రోల్ పోసిన వారిపై ఆధారాలుగా వీడియోలు ఇచ్చినా, పోలీస్ స్టేషన్లో మూడు గంటలు కూర్చున్నా ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు? డీజీపీ శివధర్ రెడ్డి గారు సమాధానం చెప్పాలి.

బీఆర్ఎస్ కార్యకర్తకు చెందిన టిప్పర్ లారీని పెట్రోల్ పోసి తగలబెట్టారు. 'ఖాకీ బుక్' అందరికీ సమానమే అని గొప్పలు చెబుతున్న డీజీపీ గారు ఇప్పుడు ఏం చేస్తున్నారు.. ఆ ఖాకీ బుక్ కాంగ్రెస్ పార్టీకి చుట్టంగా మారిపోయిందా? పోలీసుల కాలర్ పట్టుకుని తన్నమన్న బీజేపీ నాయకుడిపై, బూతులు తిట్టిన కాంగ్రెస్ నాయకుడిపై అరెస్టులు లేవు. కానీ ప్రశ్నిస్తే మాత్రం బీఆర్ఎస్ కార్యకర్తలపై కేతనపల్లి, ఆమనగల్ తదితర ప్రాంతాల్లో కేసులు పెట్టి అక్రమ అరెస్టు చేశారని అన్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట: పెన్ పవర్:** దుబ్బాక మండలం రామక్కాపేట గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అన్నం,గుడ్డు, బెండకాయ కూర,టమాటా పప్పు, రసం, పెరుగు లను పరిశీలించారు. బెండకాయ కూర, టమాటా పప్పు సాంబారు మాదిరి నీళ్ళలా ఉందని, రసం మాత్రం పచ్చి పులుసు మాదిరి ఉండడం చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి అన్ని సరుకులు, కూరగాయలు, అన్ని అందిస్తుంటే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరలతో కాకుండా భోజనం ఇలా పెడతారా అని కేర్-టేకర్ మరియు ఉపాధ్యాయులపైన మండిపడ్డారు. 500 కి పైగా విద్యార్థులకు సరిపడా వండకుండా చేసిన కూరలు సైతం 237 మంది విద్యార్థులకు సరిపోకపోగా 132 మంది విద్యార్థులకు గుడ్లు ఎందుకు తక్కువ వండారని వంట సిబ్బందిని ఆరా తీశారు. సగం మంది విద్యార్థులకు కూరలు సరిపోలేదని దగ్గరుండి టమాటా కూర వండించారు. కూరను రుచిగా చేయడానికి పలు సూచనలు చేశారు. కూర వండించి మిగిలిన విద్యార్థులకు పెట్టించారు. స్టాక్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ రాసిన సరుకులకు చేసిన వంటకంకి అస్సలు పొంతనే లేదని అసహనం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ రోజు విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని లైబ్రేరియన్, ప్రతి వంటకం విద్యార్థులకు అందరికీ సరిపోయాలని కడుపు నిండా తినేవిధంగా రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఇంత అధ్వానంగా భోజనం పెడుతున్నందుకు గాను కేర్-టేకర్ మరియు ఇతర అధికారులైన కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ అధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజి పడవద్దని ప్రభుత్వం అందజేస్తున్న ఫలాలను విద్యార్థులకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వికలాంగులను ప్రేమించలేని వ్యక్తులు అసలైన వికలాంగులు

**వనపర్తి. పెన్ పవర్:** వికలాంగులుగా జన్మించడం తప్పు కాదని అలాంటి వారిని ప్రేమించలేని వ్యక్తులే అసలైన వికలాంగులని, ప్రతి ఒక్కరు వికలాంగుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శనివారం వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మంది దివ్యాంగులకు స్కూటీల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.పాత మార్కెట్ యార్డ్ లో చేపట్టిన ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ హాజరై వారికి స్కూటీలను అందజేశారు.వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ మనందరికీ స్ఫూర్తిని ఇస్తున్న దివ్యాంగులకు మనం కూడా చేయూతనిద్దాం.. వారిని గౌరవిద్దాం. అభిమానిద్దామని వారు సూచించారు.దివ్యాంగులు వికలత్వ భావనతో ఉండరాదని ఆత్మస్థైర్యంతో, పట్టుదల, ప్రతిభతో రాణించాలని. దివ్యాంగులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో రాణించి ఎందరికో స్ఫూర్తిగా నిలవాలన్నారు.దివ్యాంగుల్లో అమోఘ శక్తి దాగి ఉంటుందని, ఆ శక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనీ చెప్పారు.వైకల్యం విజయానికి అడ్డంకి కాదు.ప్రతిభ, ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తాయి.అందరం కలుద్దాం అంగవైకల్యం ఉన్నవారికి అండగా నిలబడదామని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు దివ్యాంగుల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.

## చంచల్ గూడ జైలు లో ఉగ్ర కుట్రలు ఖండించిన జైలు అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్ర జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై జైలు శాఖ స్పందించింది. అవన్నీ పూర్తిగా వదంతులేనని జైలు శాఖ డీఐజీ శ్రీనివాస్ స్పష్టం చేశారు.చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్ర జరుగుతోందని సోషల్ మీడియా, కొన్ని ఛానెల్స్లో ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై జైళ్ళ శాఖ డీఐజీ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.
జైలులో ఎలాంటి ఉగ్ర కుట్రలు జరగలేదని, ప్రచారంలో ఉన్న వార్తలు పూర్తిగా నిరాధారమని తెలిపారు. నేషనల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశం కావడంతో వార్తలు ప్రసారం చేసే ముందు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని మీడియాకు సూచించారు. పుకార్లు వ్యాప్తి చేయడం వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. చంచల్గూడ జైలులో లష్కర్-ఏ-తొయిబాకు చెందిన జాయిద్ అనే ఒక ఉగ్రవాది మాత్రమే ఉన్నాడని తెలిపారు. అతన్ని కలవడానికి అతని భార్య తప్ప మరెవరూ రారని వెల్లడించారు. అతనికి వారానికి రెండు ములాఖాత్లు ప్రత్యేక సమయాల్లో, సాధారణ ఖైదీలతో కలపకుండా నిర్వహిస్తామని చెప్పారు. "చంచల్గూడ జైలులో ఎలాంటి ఉగ్ర కుట్రలు జరగలేదు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారాలు. నేషనల్ సెక్యూరిటీ అంశం కాబట్టి వార్తలు ప్రసారం ముందు వెరిఫై చేసుకోవాలి. పుకార్లు వ్యాప్తి చేయవద్దు." కాబట్టి చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్రలంటూ వస్తున్న వార్తలు వదంతులేనని జైలు శాఖ స్పష్టం చేసింది.

## జిల్లాలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు: జిల్లా ఎస్పీ.

**రాజన్న సిరిసిల్ల : పెన్ పవర్:** ఆదివారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.పర్యటన దృష్ట్యా గంభీరావుపేట మండలంలో ఏర్పాట్లను,హెలిప్యాడ్ ను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు.ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుంది

**వనపర్తి: పెన్ పవర్:** నిరుపేదల సొంతింటి కల నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని, గతంలోనూ ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదలకు ఇండ్లు మంజూరయ్యాయని నేడు రేవంత్ రెడ్డి సర్కార్ లోనే రూ. ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ నీరు పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారుశు క్రవారం వనపర్తి మండలం చందాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న పుల్లరి నీలమ్మ నాగరాజు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలిపారుఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి నిర్మాణం కోసం కలలుగన్న మా కుటుంబానికి నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి మాకు ఓ సొంత గూడును ఏర్పాటు చేసుకునేందుకు 5 లక్షల రూపాయలు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి, వనపర్తి నిరుపేదల ఆశాజ్యోతి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారుతమ ఆర్థిక స్తోమత సరిగా లేక ఇరుకు ఇళ్లల్లో ఉంటూ జీవనం గడిపామని, ఇక సొంత ఇంటి కల నెరవేరదు అనుకుని నిరాశ చెందిన మాకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి రూ.5 లక్షల రూపాయలు అందజేసిందని ఇలాంటి ప్రభుత్వం అధికారుల పాటు ప్రజలకు సేవలందించాలని వారు కృతజ్ఞతలు తెలియజేశారుకార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, అమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఖమ్మంలో రూ.4.50 కోట్ల క్యాంపు కార్యాలయం...

# ఆర్థిక మంత్రిపై విమర్శల వెల్లువ

**హైదరాబాద్ పెన్ పవర్:** భట్టి విక్రమార్క అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల మధ్య, ఖమ్మం జిల్లాలో రూ.4.50 కోట్ల వ్యయంతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మాణం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే మధిరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అలాగే హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఖమ్మంలో మరో ప్రత్యేక క్యాంపు కార్యాలయం అవసరమా అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. గతంలో భారత రాష్ట్రసమితి ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1 కోట్ల వ్యయంతో క్యాంపు కార్యాలయం నిర్మించగా, ప్రస్తుత నిర్మాణానికి రూ.4.50 కోట్ల ప్రజా ధనం ఖర్చు చేయడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం ప్యాలెస్‌తరహాలో నిర్మాణం జరుగుతోందని, ఇది ప్రజా ధన వినియోగంలో అసమతుల్యతను సూచిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ఖమ్మం జిల్లా తన ఆధిపత్యాన్నిచాటుకునే క్రమంలోనే ఈ నిర్మాణం చేపట్టారని, ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఒక రాజకీయ సందేశం ఇవ్వడానికే ఈ భవనం నిర్మాణమని ప్రచారం సాగుతోంది. అయితే ఈ వ్యాఖ్యలపై అధికారికంగా ఎటువంటి స్పష్టీకరణ వెలువడలేదు.ఇదే సమయంలో పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలకు నిధుల కొరత ఉందని ప్రభుత్వం పేర్కొంటున్ననేపథ్యంలో, మంత్రిగారి కోసం భారీ వ్యయంతో భవనం నిర్మాణం చేపట్టడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
అలాగే, ఒక మంత్రికి ఇంత భారీ స్థాయిలో క్యాంపు కార్యాలయం నిర్మిస్తే, ఇతర మంత్రులు కూడా ఇలాంటిసదుపాయాలు కోరితే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోందని సమాచారం.ఈ అంశంపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దు.. అసాధ్యమే..!!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దుచేయాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు లీకులు ఇస్తున్నాయి. ప్రస్తుతమున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ వ్యవస్థల వల్ల అధికార యంత్రాంగం క్లిష్టంగా మారుతోందని, నిధుల వినియోగంలోజాప్యం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మధ్యంతర వ్యవస్థలను తొలగించి, గ్రామ పంచాయతీ సర్పంచులకు , జిల్లా స్థాయి యంత్రాంగానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు.పరిషత్‌లకు చాలా స్వల్పంగానే నిధులు..
ప్రస్తుతం మండల పరిషత్ , జిల్లా పరిషత్ సభ్యులకు కేటాయించే నిధులు చాలా పరిమితంగా ఉంటున్నాయి. అనేక సందర్భాల్లో ఎంపీటీసీలకు కనీస అధికారాలు కూడా ఉండటం లేదనే అసంతృప్తి వారిలో ఉంది. ఈవ్యవస్థను రద్దు చేయడం ద్వారా పాలనాపరమైన ఖర్చులను తగ్గించడమే కాకుండా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మండల వ్యవస్థను కేవలం పరిపాలనావిభాగంగానే ఉంచి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని గ్రామ, జిల్లా స్థాయిలకే పరిమితం చేయడం ద్వారా ద్వంద్వ పాలన కు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే సాధ్యం కాదు..**

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం అంత సులభమైన విషయం కాదు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామ, మండల, జిల్లా స్థాయిలుఅమలులో ఉండాలి. దీనిని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటు ఆమోదం కూడా అవసరమవుతుంది. కేవలం రాష్ట్ర స్థాయి నిర్ణయంతో రాజ్యాంగబద్ధమైన
ఈ వ్యవస్థలను రద్దు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొగ్గు చూపితే, దీనిపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగే అవకాశం ఉంది.

**కలసి వచ్చే పార్టీలు ఉండవు..**

పరిషత్‌ల రద్దు ప్రతిపాదనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలనుకునే నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. ముఖ్యంగా విపక్షాలు దీనినిప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్ ఆలోచన చర్చకు కారణం అవుతుంది కానీ అమల్లోకి రాకపోవచ్చు..!!

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

## పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్-ఆఫిషియో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్--అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు.గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము," అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీ లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.



ఎంపి ఈటెల రాజేందర్‌ను కలిసిన గండిమైసమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళవాసులు..

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన మూడేళ్ళ తరువాత లబ్దిదారులకు నోటీసులు జారీ చేయడం, హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.. కలెక్టర్ సమక్షంలో, కంప్యూటరైజ్డ్ ద్వారా లబ్దిదారుల ఎంపిక పారదర్శకత, అధికారుల పనితీరునే, వక్రీకరించే విధంగా ఉందని బీజేపీ నేతలు ఎద్దేవా చేశారు.. మూడేళ్ళకు లబ్దిదారులను అర్హులు కాదంటూ నోటీసులు ఇవ్వడం, ఎంపిక ప్రక్రియను తప్పు పడుతున్నారా..? అసలు ఎవరి ఆదేశాలతో అర్థాంతరంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను, కలిసిన బాధిత మహిళలు బోరున విలపించి తమగోడును వినిపించారు.. స్పందించిన ఎంపి బాధితుల తరపన కలెక్టర్‌తో మాట్లాడారు..

దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 21:

# గండిమైసమ్మలో 'డబుల్ బెడ్రూమ్' దుమారం..!

## నోటీసుల పేరుతో పేదలపై ఒత్తిడి..? ఎంపీ ఈటల రాజేందర్ జోక్యం..!

- కలెక్టర్ ఎంక్వయిరీ అంటూ నివాసులకు షాక్ నోటీసులు..!
- 'ప్లాట్ ఉంది, కార్ ఉంది' అంటూ ఇల్లు రద్దు చేస్తామని హెచ్చరికలు..
- ఎంపీ ఎదుట మహిళలు కన్నీటి పర్యంతం..! "ఈఇల్లే తమకు దిక్కంటూ ఆవేదన వ్యక్తం..
- వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి విషయాన్ని ప్రస్తావించిన ఈటెల..
- "ధైర్యంగా ఉండండి, నేనున్నాను" అంటూ ఎంపి ఈటల భరోసా..
- మూడేళ్లుగా పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్న డబుల్ బెడ్ రూమ్ వాసులు..
- అకస్మాత్తుగా ఈ నోటీసుల చర్యలపై అనుమానాలు..
- వసతులు కల్పించని కాలనీకి నోటీసులు..? రాజకీయ నాటకమా..?: బీజేపీ విమర్శలు..

దుండిగల్ సర్కిల్‌లో గండిమైసమ్మ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల విషయంలో, కొత్త వివాదం చెలరేగింది. కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంక్వయిరీ పేరుతో కొంతమంది వచ్చి "మీ పేరు మీద వేరే ప్లాట్ ఉందని, కరెంట్ మీటర్ ఉంది, కార్ ఉంది.. కాబట్టి మీకు కేటాయించిన ఇల్లు రద్దు అవుతుంది" అంటూ నోటీసులు ఇవ్వడంతో డబుల్ బెడ్ రూమ్ వాసులు భయాందోళనలకు గురయ్యారు.. ఈ అంశంపై దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ డబుల్ బెడ్రూమ్ వాసులు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను కలిసి తమ గోడును వినిపించారు.. కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, విష్ణు, సాయి కృష్ణ, కాలనీవాసులు సురేష్ సహా అనేకమంది మహిళలు ఎంపి ఈటల రాజేందర్‌ను కలిశారు..

### నేటికీ వసతులు కల్పించకపోయినా..! నోటీసుల జారీ..!

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో తాగునీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్, షాపుల కేటాయింపు వంటి ప్రాథమిక సదుపాయాలు సరిగా లేవని వాసులు వాపోయారు. "మూడు సంవత్సరాలుగా మౌలిక వసతులు ఇవ్వకుండా ఇప్పుడు నోటీసులు ఇస్తూ ఇళ్లను రద్దు చేస్తామని బెదిరించడం అన్యాయమని పేర్కొన్నారు.. ఇల్లు కేటాయింపులపై ఎలాంటి ఎంక్వయిరీ జరిగినా పారదర్శకంగా నిర్వహించాలని, పేదల జీవనాధారాన్ని కాపాడాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు.. గండిమైసమ్మ డబుల్ బెడ్రూమ్‌ల వివాదంలో రాజకీయంగా వేడిని రాజేస్తుండగా, అధికార యంత్రాంగం స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### ఈ ఇల్లు తప్ప మాకు దిక్కులేదు.. మహిళల ఆవేదన..

మల్కాజిగిరి ఎంపీ సమక్షంలో కొంతమంది మహిళలు కన్నీరు పెట్టుకున్నారు.. ఓ మహిళ మాట్లాడుతూ, "ఎన్నో ఏళ్లకు సొంతింటి కల నెరవేరిందని సంతోషిస్తున్న సమయంలో ఇల్లు రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వడం తమను బాధిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.. తమకు ఇది తప్ప వేరే ఆస్తి లేదని. నా కూతురు పెళ్లి చేయాలి, మా బతుకు ఆగమైపోతుందని విలపించారు.. మరొక మహిళ, "టాక్సీ నడిపి జీవనం సాగించాలనుకుని లక్ష రూపాయలు అప్పు తీసుకుని కార్ కొన్నాను. ఇప్పుడు 'నీకు కార్ ఉంది కాబట్టి ఇల్లు క్యాన్సిల్' అంటున్నారు" అంటూ కంటతడిపెట్టింది..ఇంకొకరు, "ఇల్లు అప్పై చేసినప్పుడు పరిస్థితి దయనీయంగా ఉండడంతో కొంతమంది సాయం చేసి నా పేరు మీద చిన్న ప్లాట్ రిజిస్ట్రేషన్ చేశారు.. ఇప్పుడు అదే కారణంగా చూపుతూ ఇల్లు రద్దు చేస్తామంటున్నారు.. నాకు చావు తప్ప వేరేదారి లేదంటూ ఉరేసుకునేందుకు వెళ్లిన సందర్భాన్ని స్థానికులు ఆమెను కాపాడినట్లు ఎంపి దృష్టికి తీసుకెళ్ళారు.. దీంతో ఎంపీ జోక్యం చేసుకుని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు.."ఎవరైనా మీపై ఫిర్యాదులు చేస్తున్నా భయపడొద్దు. ధైర్యంగా ఉండండి. నేనున్నాను" అంటూ బాధితులకు భరోసా ఇచ్చారు..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ సముదాయం.. ఫైల్‌ఫోటో..



### "ఇది రాజకీయ నాటకం": బీజేపీ ఆరోపణ..!

దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "ఇల్లు కేటాయించి మూడు సంవత్సరాలు గడిచింది.. డబుల్ బెడ్ రూమ్ వాసులు ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు క్రమంగా చెల్లిస్తున్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా నోటీసులు ఇవ్వడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని ఆరోపించారు..స్థానికంగా అధికార కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం జరుగుతోందని కృష్ణారెడ్డి విమర్శించారు.. ఇల్లు కేటాయించే ముందు ఎంక్వయిరీ చేయలేదా..? లబ్దిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదా..? అంటూనే, అధికారులే తమ ఎంపిక ప్రక్రియను ఇలా వక్రీకరించుకునే విధంగా ఉందని ఆయన విమర్శించారు.. ఇది అధికారుల పనేనా..? లేక రాజకీయ నాటకమా అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు..

# పరామర్శకు బయలుదేరితే...

# హౌస్ అరెస్ట్


- కామారెడ్డి దాడి నేపథ్యంలో బయలుదేరిన ఎంపీని అడ్డుకున్న పోలీసులు..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసిన ఎంపి ఈటెల రాజేందర్..

## ప్రజాస్వామ్యాన్ని బందీ చేసిన ప్రభుత్వం:ఎంపి ఈటల రాజేందర్..!



ఏంపి ఈటలను హౌస్ అరెస్ట్ చేసిన మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి, డిఐ కిరణ్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 21: కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటిమీద దాడి ఘటన నేపథ్యంలో పరామర్శించేందుకు బయలుదేరిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. భారీగా పోలీసులు, ఏసీపీతో సహా ఈటల నివాసానికి చేరుకుని ఆయన కదలికలను అడ్డుకున్నారు.. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి ఇంటిమీద దాడి జరిగిన నేపథ్యంలో ఆయనకు సంఘీభావం తెలపడానికి ఈటల రాజేందర్ కామారెడ్డి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ముందస్తు సమాచారం మేరకు పోలీసులు ఆయన నివాసం వద్ద మోహరించి, బయటకు వెళ్లకుండా నిరోధించారు. ఈ క్రమంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.. ప్రభుత్వ వైఖరిపై ఈటల తీవ్ర విమర్శలు చేశారు.. హౌస్ అరెస్ట్‌పై స్పందించిన ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. తెలంగాణలో పార్టీలు, నాయకుల మాటలు వింటుంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మాటలకే పరిమితం కాకుండా దాడులకు దిగుతున్నారని ఆరోపించారు.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వారు దాడులు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.. మా ఎమ్మెల్యేకు సంఘీభావం ప్రకటించడానికి వెళ్లనివ్వకపోవడం అప్రజాస్వామికమని మండిపడ్డారు.. చీటికీ మాటికీ హౌస్ అరెస్టులు చేయడం సరికాదని అన్నారు.



ఎంపి ఈటెల రాజేందర్ హౌస్ అరెస్ట్ చేసిన మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి,

### కేసీఆర్ చేసిందే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి చేస్తున్నారు..!

గతంలో మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు హయాంలోనూ ఇలాంటి హౌస్ అరెస్టులు జరిగాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారని ఈటల విమర్శించారు.. హౌస్ అరెస్ట్ పేరిట నాయకుల కదలికలను నియంత్రించడం ప్రజాస్వామ్యంలో తగదని సూచించారు.. పదే పదే హౌస్ అరెస్టులు చేసి, పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం సరైన పద్ధతి కాదు. దీనికి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు" అంటూ హెచ్చరించారు..ఈ ఘటనతో తెలంగాణలో అధికార ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాడి ఘటనపై ఇప్పటికే చర్చలు మొదలైన నేపథ్యంలో, ఎంపీ హౌస్ అరెస్ట్ వ్యవహారం కొత్త వివాదానికి తెరతీసింది.. కామారెడ్డి ఘటన, మల్కాజిగిరి ఎంపీ హౌస్ అరెస్ట్ మరిన్ని వివాదాలకి దారితీసే విధంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు..

## మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో మటన్, చికెన్ షాపులపై దాడులు కుళ్లిపోయిన మటన్ సీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్లో మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్ మరియు చికెన్ షాపులపై వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా "సైదులు మటన్ డ చికెన్ సెంటర్"లో కుళ్లిపోయిన మటన్ ఫ్రిడ్జ్లో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే సంబంధిత షాప్కు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో ఆ షాప్ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు.
ఇతర మటన్ మరియు చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.

## వాడపల్లి వెంకన్న దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో వేకువ జామునుండే పోటెత్తిన భక్తులు

**కొత్తపేట: పెన్ పవర్:** చందన స్వరూపుడు స్వయంభూ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం పర్వదినం కావడం తో వాడపల్లిలో స్వయంభూగా వెలసిన చందన స్వరూపుడు ఏడుశనివారాలు ఏడుప్రదక్షిణలు వెంకన్న బాబుగా ఖ్యాతి గాంచి అశేష భక్త జనంతో మొక్కులు తీర్చుకోవడానికి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు.
భక్తులు నాలుగు మాడవీధుల గుండా గోవింద నామస్మరణతో ఏడు ప్రదక్షిణలు అనంతరం స్వామిని దర్శించి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశామని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు అదజేస్తున్నామని దర్శనానంతరం భక్తులకోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాదం స్వీకరించాలని ఇజ కోరారు

# స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్ తమిళ రాజకీయాల్లో సంచలనం

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం , ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తమిళనాడు శాసనసభ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏఐఏడీఎంకే లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాల వల్ల ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఓపీఎస్, తన సొంత వర్గంతో రాజకీయంగా ఒంటరయ్యారు. ఈ క్రమంలో అధికార పక్ష నేతను ఆయన కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు శాసనసభలో రెండ్రోజుల పాటు జరిగిన తాత్కాలిక బడ్జెట్ చర్చల సందర్భంగా ఓపీఎస్ మద్దతుదారుడు, ఎమ్మెల్యే ఐయ్యప్పన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ము.క. స్టాలిన్ మళ్లీ విజయం సాధించి, తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ జయలలిత ఆశీస్సులతో స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎంకే ఐదేళ్ల పాలన అత్యంత అద్భుతంగా ఉందని కొనియాడారు. అందుకే ఉదయాన్నే ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన విశ్లేషించారు. తన మద్దతుదారు ఐయ్యప్పన్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ప్రజల మనోగతానికి ప్రతిరూపమని ఓపీఎస్ సమర్థించారు. మీరు డీఎంకేలో చేరుతారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఓపీఎస్ స్పందిస్తూ.. కొంతకాలం వేచి చూడండి అని బదులిచ్చారు. ఈ సమాధానం ఆయన పార్టీ మారబోతున్నారనే అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, జయలలిత మరణం తర్వాత ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన ఓపీఎస్.. 'ధర్మయుద్ధం' చేసినా, 'హక్కుల పునరుద్ధరణ కమిటీ' పెట్టి పోరాడినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆయన ప్రధాన అనుచరులంతా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లో చేరిపోగా, ఇప్పుడు ఆయన వద్ద మిగిలింది కేవలం ఎమ్మెల్యే ఐయ్యప్పన్ మాత్రమే. ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఓపీఎస్ డీఎంకే వైపు మొగ్గు చూపుతున్నారా అనే సందేహం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన స్పష్టత అతి త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా ఐదు రాష్ట్రాల ఎన్నికలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే మ్మరీడు నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ-బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది. పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు, బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

## ప్రభుత్వానికి మాలల జేఏసీ తీవ్ర హెచ్చరిక

**కొత్తపేట: పెన్ పవర్:** మంద కృష్ణ మాదిగ పై తక్షణమే రాజద్రోహం కేసు నమోదు చేయాలని, అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేశారని మాలల జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రావులపాలెంలో నిర్వహించిన మాలల జెఎసి నాయకులు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మందా కృష్ణ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో మందా కృష్ణ పై ఫిర్యాదులు ఇస్తామని తీర్మానించారు. రాష్ట్రం లోని 26 జిల్లాల్లో భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అంబేద్కర్‌ను అవమానిస్తే సహించబోమని జేఏసీ నాయకులు
స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్, నెల్లి లక్ష్మీపతి, కప్పల శ్రీధర్, కప్పల నాగేశ్వరరావు, కొనాల అంబేద్కర్, సబ్బిటి మోహన్ రావు, జక్కల అరుణకుమార్ తదితరులు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆ ఒక్కరూ ఎవ్వరు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, పెన్ పవర్:**
తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది. శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా
ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ
ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, పెన్ పవర్:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి




ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** :తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్‌పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది.
అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు







**తిరుపతి, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ... 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను... విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్





**విజయవాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్‌లో ఆయన చంద్రబాబు, పవన్‌తో పాటు నారా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ా20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్‌గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్‌పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో ా జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రాజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగాా జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు

**అనంతపురం, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్‌లు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్‌లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం.వైసీపీ నేతలు గతంలో పలుమార్లు "బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు" అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్-లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి.హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు. ఈ సొంత ఇల్లు రాబోయే రోజుల్లో టీడీపీ రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం

ఉంది.మొత్తానికి నందమూరి బాలకృష్ణ తీసుకున్న ఈ నిర్ణయం హిందూపురం ప్రజల్లో సానుకూల పవనాలను పెంచింది. "మా ఎమ్మెల్యే మా వాడు.. మా మధ్యే ఉంటారు" అనే భావన ప్రజల్లో బలంగా నాటుకునేలా ఈ గృహారంభం తోడ్పడుతుంది. కేవలం ఒక భవన నిర్మాణంగా కాకుండా, తన రాజకీయ ఉనికిని మరింత సుస్థిరం చేసుకునే దిశగా బాలయ్య వేసిన 'మాస్ స్టెప్'గా దీనిని అభివర్ణించవచ్చు.

## చింతకాయలకు ఫిక్స్...

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21 పెన్ పవర్:** టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు.పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది. దేశ రాజకీయాలకంటే రాష్ట్ర రాజకీయాల్లోనే చింతకాయల విజయ్ ను ఉంచాలని భావిస్తున్నారు. అయ్యన్నపాత్రుడు కోరిక కూడా అదే. పార్టీ సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్ గా పనిచేయడమే కాకుండా చింతకాయల విజయ్ నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు. సామాజికవర్గం కోటా కూడా ఇందుకు పనిచేస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో చింతకాయల విజయ్ ను కేబినెట్ లో తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. విజయ్ పడిన కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా 2029 ఎన్నికలకు విజయ్ బీసీ కోటా కింద ఎంపికవుతారన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా ఉంది.

## జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

**కాకినాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

## జగన్ పై కేసుల్లేవ్...



**విజయవాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు. జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది.అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు. ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళ్లు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం. జగన్ కు అనవసరంగా సానుభూతి తెచ్చి పెట్టే ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# సిబిల్ స్కోర్ సూపర్ ఉన్నా లోన్స్ రావట్లేదా.. అసలు తప్పు ఎక్కడ జరుగుతోందంటే..?




సిబిల్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే చాలు.. ఏ బ్యాంకైనా రెడ్ కార్పెట్ వేసి రమ్మని పిలిచి మరీ లోన్ ఇచ్చేస్తుందని చాలామంది అనుకుంటుంటారు. కానీ రియాలిటీలో పరిస్థితి మరోలా ఉంది. మంచి క్రెడిట్ స్కోర్ ఉండి, గతంలో సకాలంలో బాకీలు చెల్లించిన ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ.. అనేకమంది లోన్ అప్లికేషన్స్ రిజెక్ట్ అవుతున్నాయి. స్కోర్ అనేది కేవలం ఒక ప్రాథమిక అర్హత మాత్రమేనని.. లోన్ మంజూరు చేయడానికి బ్యాంకులు మరిన్ని లోతైన అంశాలను పరిశీలిస్తాయని గుర్తించాలి. మీ స్కోర్ బాగున్నా లోన్ ఎందుకు రావడం లేదో.. ఎక్కడ తప్పులు జరుగుతున్నాయో ఇప్పుడు తెలుసుకోండి..

**ఆదాయం అప్పుల నిష్పత్తి:**
క్రెడిట్ స్కోర్ 800 ఉన్నా సరే.. ఆదాయానికి మించి ఇప్పటికే అప్పులు ఉంటే బ్యాంకులు లోన్ ఇవ్వడానికి వెనుకాడతాయి. మీ నెలవారీ జీతంలో సగానికి పైగా మొత్తం ఇప్పటికే ఉన్న హోమ్ లోన్, కార్ లోన్ లేదా క్రెడిట్ కార్డ్ ఈఎంఐలకే పోతుంటే.. కొత్త అప్పులు తీసుకున్నా వాటిని తీర్చే సామర్థ్యం మీకు లేదని బ్యాంకులు భావిస్తాయి. దీనినే డెట్-టు-ఇన్కమ్ రేషియో అంటారు బ్యాంకింగ్ భాషలో.

**ఎక్కువ సార్లు లోన్ అప్లికేషన్స్:**
తక్కువ కాల వ్యవధిలోనే ఎక్కువసార్లు లోన్లు, క్రెడిట్ కార్డుల కోసం అప్లై చేయడం ఆర్థిక అస్థిరతకు సంకేతంగా కనిపిస్తుంది. మీరు అప్లై చేసిన ప్రతిసారీ బ్యాంకులు క్రెడిట్ రిపోర్టును పరిశీలిస్తాయి. ఇలా పదేపదే ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి ఎంక్వయిరీలు జరగడం వల్ల మీరు అప్పుల కోసం తహతహలాడుతున్న కస్టమర్ల కేటగిరీలోకి వెళ్లిపోతారు. ఫలితంగా స్కోర్ బాగున్నా లోన్ రిజెక్షన్ జరుగుతుంది.

**పనిచేస్తున్న కంపెనీ గుర్తింపు:**
బ్యాంకులు కేవలం మీ సిబిల్ స్కోర్‌నే కాదు.. మీరు ఎక్కడ పని చేస్తున్నారు. ఎంత కాలంగా చేస్తున్నారు అనే అంశాలను కూడా చూస్తాయి. తరచూ ఉద్యోగాలు మారడం, ప్రస్తుత కంపెనీలో ప్రొబేషన్ పీరియడ్‌లో ఉండటం లేదా కంపెనీ బ్యాంకుల అప్రూవ్డ్ లిస్ట్ లో లేకపోవడం వంటివి లోన్ రిజెక్షన్‌కు దారితీస్తాయి. స్థిరమైన ఆదాయం, నమ్మకమైన సంస్థలో పని చేయడం లోన్ రావడానికి కీలకమని గుర్తుంచుకోండి.

**డాక్యుమెంటేషన్.. రిపోర్ట్ రిమార్క్స్:**
ఐడీ ప్రూఫ్స్, అడ్రస్ లేదా ఆదాయ ధృవీకరణ పత్రాల్లో చిన్న తేడాలు ఉన్నా అప్లికేషన్ తిరస్కరణకు గురవుతుంది. అలాగే మీ క్రెడిట్ రిపోర్టులో పాత అప్పుల విషయంలో 'సెటిల్డ్' అని ఉంటే అది నెగటివ్ మార్కుగా మారుతుంది. లోన్ పూర్తిగా కట్టేసి 'క్లోజ్డ్' అని ఉంటేనే అది మంచి రిపోర్ట్. లేట్ పేమెంట్స్ లేదా వడ్డీ తగ్గింపు కోసం చేసిన రిక్వెస్టులు కూడా రిపోర్టులో రిమార్క్స్‌గా మిగిలిపోతాయి.

**తక్కువ క్రెడిట్ హిస్టరీ:**
కేవలం ఒకే రకమైన క్రెడిట్ కార్డ్ లేదా లోన్ వాడటం కంటే.. సెక్యూర్డ్ హోమ్ లోన్, అన్-సెక్యూర్డ్ పర్సనల్ లోన్ అప్పుల కలయిక ఉండటాన్ని బ్యాంకులు ఇష్టపడతాయి. తక్కువ క్రెడిట్ హిస్టరీ ఉన్న వారికి కూడా బ్యాంకులు పెద్ద మొత్తంలో లోన్ ఇవ్వడానికి సాహసించవు.

**లోన్ రిజెక్ట్ అయితే ఏం చేయాలి..?**
ఒక సంస్థ లోన్ రిజెక్ట్ చేయగానే వెంటనే మరో బ్యాంకులో అప్లై చేయకండి. ముందుగా మీ క్రెడిట్ రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులను సరిదిద్దుకోండి. ఇప్పటికే ఉన్న అప్పులను కొంతమేర తగ్గించుకుని.. కనీసం 3 నుండి 6 నెలల గ్యాప్ తర్వాత మళ్లీ తిరిగి ట్రై చేస్తే లోన్ రావటానికి చాన్సెస్ ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక తప్పులు, పొరపాట్లను సరిచేసుకోకుండా ఎన్ని కంపెనీల చుట్టూ లోన్ కోసం తిరిగినా రిజెక్షన్ మాత్రమే ఎదురవుతుందని గుర్తుంచుకోండి.

# మీకో దండం.. మీ దేశానికో దండం : పాకిస్తాన్ నుంచి వెళ్లిపోయిన 125 కంపెనీలు




పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు మరో భారీ షాక్ తగిలింది. ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం అటుంచి.. ఇప్పటికే ఉన్న వ్యాపారాలను కొనసాగించడం కూడా భారంగా భావిస్తున్న అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు కట్టగట్టుకుని దాయాది దేశాన్ని విడిచి వెళ్లిపోతున్నాయి. పాకిస్తాన్ కార్పొరేట్ నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆఫ్ పాకిస్తాన్ విడుదల చేసిన తాజా జాబితా ఈ చేదు నిజాన్ని బయటపెట్టింది. జనవరి 20, 2026 నాటికి ఏకంగా 125 విదేశీ కంపెనీలు పాకిస్తాన్‌లో తమ కార్యకలాపాలను శాశ్వతంగా మూసివేశాయి.

**అన్ని రంగాల నుంచి ఎగ్జిట్..**
పాకిస్తాన్ అబ్జర్వర్ నివేదిక ప్రకారం.. కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్ వంటి ప్రధాన నగరాల్లో ఉన్న బ్రాంచ్ ఆఫీసులు.. లైజన్ కార్యాలయాలను విదేశీ కంపెనీలు మూసివేశాయి. కేవలం ఒక్క దేశం నుంచే కాకుండా అమెరికా, బ్రిటన్, యూఏఈ, చైనా, మలేషియా, సింగపూర్, జపాన్, టర్కీ, ఆస్ట్రేలియా, స్వీడన్, బహ్రెయిన్, కెనడా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన చాలా కంపెనీలు కూడా పాకిస్తాన్ నుంచి తరలి వెళ్లిపోతున్నాయి బిజినెస్ క్లోజ్ చేసుకుని.

పాకిస్తాన్ వదిలి వెళ్లిన కంపెనీల జాబితాలో ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్లు ఉండటం గమనార్హం. ఇంధన రంగ దిగ్గజం ఎక్సాన్ మొబిల్ అనుబంధ సంస్థ తన వ్యాపారాన్ని మూసివేసింది. ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరుగాంచిన పానాసోనిక్, ప్రముఖ విమానయాన సంస్థ లుఫ్తాన్సా జర్మన్ ఎయిర్ లైన్స్ కూడా తమ బోర్డులను తిప్పేశాయి. సాంకేతిక పరిజ్ఞానం, టెలికాం రంగం నుంచి డెల్ గ్లోబల్, నార్టెల్ నెట్వర్క్స్, టెలికార్డియా టెక్నాలజీస్ వంటి కంపెనీలు అక్కడి నుంచి సర్దుకున్నాయి. ఆయిల్ అండ్ గ్యాస్ రంగం నుంచి హల్లీబుర్ష్?న్ లిమిటెడ్, నిర్మాణ రంగంలో డూసన్ హెవీ ఇండస్ట్రీస్ కంపెనీలు వెనుదిరిగాయి. బ్యాంకింగ్ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంది. మార్షక్ బ్యాంక్. జైరాత్ బ్యాంకాసీ వంటి అంతర్జాతీయ బ్యాంకులు పాకిస్తాన్ కార్యకలాపాలను చాలించుకున్నాయి. కేవలం వ్యాపార సంస్థలే కాకుండా.. సామాజిక వాణిజ్య సేవలందించే అమెరికన్ సోయాబీన్ అసోసియేషన్, పీస్ విండ్స్ జపాన్ వంటి ఎన్జీవోలు.. వాణిజ్య సంస్థలు కూడా తమ ఆఫీసులను మూసివేసిన లిస్టులో చేరిపోయాయి.

**ఈ దుస్థితికి కారణం ఏంటంటే..?**
ఈ కంపెనీలు పాకిస్థాన్ నుంచి ఎందుకు వెళ్లిపోయాయనే విషయమై రాజుబ్జూ స్పష్టమైన కారణాలను వెల్లడించలేదు. కానీ పాకిస్తాన్‌లోని అస్థిరమైన ఆర్థిక పరిస్థితులు, విదేశీ మారక ద్రవ్య నిల్వల కొరత, రాజకీయ అనిశ్చితి వల్ల గ్లోబల్ ఇన్వెస్టర్లు అక్కడ ఉండటానికి భయపడుతున్నారని తేలింది. విదేశీ కంపెనీలు ఒక దేశాన్ని విడిచి వెళ్లడం అనేది ఆ దేశ పెట్టుబడి వాతావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా డెల్, పానాసోనిక్, లుఫ్తాన్స వంటి బ్రాండ్లు తప్పుకోవడం పాకిస్తాన్ ప్రతిష్టను ప్రపంచ మార్కెట్‌లో దెబ్బతీస్తున్నాయని చెప్పుకోవచ్చు.

# వాట్సాప్ లో కొత్త ఫీచర్.. గ్రూప్ లో కొత్త మెంబర్లకోసం "గ్రూప్ మేసేజ్ హిస్టరీ"




వాట్సాప్ యూజర్లకు గుడ్ న్యూస్.. వాట్సాప్ లో కొత్త ఫీచర్ వచ్చింది. గ్రూప్ చాట్ చేసేవారికి ఇది బెస్ట్ వన్. ఇప్పటివరకు వాట్సాప్ గ్రూప్ లో కొత్త వారు జాయిన్ అయితే పాత మేసేజ్ లను చూడలేరు. అటువంటి వారికోసమే మెటా..గ్రూప్ మేసేజ్ హిస్టరీ అనే కొత్త ఫీచర్ ను అందిస్తోంది.

ఇప్పటివరకు వాట్సాప్ గ్రూప్‌లో కొత్తగా ఎవరైనా చేరితే, వారు పాత మెసేజ్‌లను చూడలేకపోయేవారు. దీంతో మిగతా సభ్యులు స్క్రీన్‌షాట్లు పంపడం లేదా మెసేజ్‌లను మాన్యువల్‌గా ఫార్వర్డ్ చేయడం చేసేవారు. ఇప్పుడు ఆ సమస్యకు చెక్ పడింది. గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్ ద్వారా అడ్మిన్లు లేదా గ్రూప్ సభ్యులు ఇటీవలి మెసేజ్‌లను కొత్తవారితో నేరుగా షేర్ చేయవచ్చు.అడ్మిన్లు, గ్రూప్ సభ్యులు ఇటీవలి మేసేజ్ లను కొత్తవారితో పంచుకోవడం ద్వారా కొత్త సభ్యులను త్వరగా కలుపుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. టీం వర్క్ ను స్పీడప్ చేస్తుంది. ఈ అప్డేట్ వాట్సాప్ మేసేజ్ ల మాదిరిగా నే ఎండ్ టు ఎండ్ ఎన్ క్రిప్ట్ అందిస్తుంది. మీరు చేసే మేసేజ్ లు, చాటింగ్ లకు ప్రైవసీ అందిస్తుంది. యూజర్లు ఇంతకుముందులాగా స్క్రీన్ షాట్ లు, మాన్యువల్ మేసేజ్ లను ఫార్వార్డ్ చేయాల్సిన అవసరం లేదు.

**100 వరకు మేసేజ్ లు పంపొచ్చు..**
గ్రూప్ మేసేజ్ హిస్టరీ ఫీచర్ ద్వారా ఒక గ్రూప్ లో కొత్తగా చేరిన సభ్యుడికి 25 నుంచి 100 మేసేజ్ లు పంపించవచ్చు. ఇది కొత్త వారికి త్వరగా గత విషయాలను తక్కువ సమయంలో తెలియజేయవచ్చు. అయితే ఈ ఫీచర్ ను నిర్వాహకులు కోరుకుంటే డిసేబుల్ చేయొచ్చు. తిరిగి ఎనేబుల్ చేసుకోవచ్చు.

టైమ్ స్టాంప్‌తో.. త్వరగా గుర్తించేలా..
ఈ ఫీచర్ ద్వారా షేర్ చేసిన మెసేజ్‌లు స్పష్టమైన టైమ్ స్టాంప్ తో కనిపిస్తాయి.
సాధారణ మెసేజ్‌ల కంటే ఇవి కొంచెం భిన్నంగా కనిపించడం వల్ల కొత్త సభ్యులు అవి షేర్ చేసిన హిస్టరీ అని సులభంగా గుర్తించగలరు.
గ్రూప్ చాట్‌లను మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా మార్చేందుకు వాట్సాప్ తీసుకొచ్చిన ఈ ఫీచర్ యూజర్లకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ముఖ్యంగా ఆఫీస్ గ్రూప్‌లు, స్కూల్ గ్రూప్‌లు, కమ్యూనిటీ చాట్‌లకు ఇది బెస్ట్ ఫీచర్ అని చెప్పొచ్చు.

## మెడికల్ కంటిన్జెన్సీ ఫండ్ అంటే ఏంటి..? హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నోళ్లకు కూడా ఇది అవసరమా..?




ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దోళ్లు. కానీ ఆ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు మన జేబు ఖాళీ కాకుండా చూసుకోవడం అంతకంటే ముఖ్యం. చాలామంది ఒక హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసేసుకుంటే చాలు.. ఇక ఏ ఆపద వచ్చినా డోకా లేదు అని ధీమాగా ఉంటారు. కానీ అది ఒక భ్రమ మాత్రమే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య ద్రవ్యోల్బణం, పాలసీలో ఉండే లోపాలు, జేబులోంచి పెట్టాల్సిన అదనపు ఖర్చులు మన ఆర్థిక ప్రణాళికను తలకిందులు చేయగలవు. అందుకే కేవలం హెల్త్ ఇన్సూరెన్స్ పైనే ఆధారపడకుండా మెడికల్ బ్యాకప్ ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అసలు నిజాలేంటో ఒకసారి చూద్దాం..

**ఇన్సూరెన్స్ ఉంటే సరిపోదు..**
దేశంలో మెడికల్ ద్రవ్యోల్బణం ఏటా 12-14 శాతం పెరుగుతోంది. అంటే ఈ రోజు 10 లక్షల రూపాయల ఖర్చయ్యే వైద్యం.. మరో ఐదేళ్లలో దాదాపు రెట్టింపు అవ్వచ్చు. కేవలం 10 లక్షల పాలసీ ఉందని నిశ్చింతగా ఉంటే.. భవిష్యత్తులో అది ఏ మూలకు సరిపోకపోవచ్చు. అలాగే దాదాపు 40% వైద్య ఖర్చులు ఇప్పటికీ సామాన్యులు తమ సేవింగ్స్ నుంచే చెల్లిస్తున్నారు. దీనికి కారణం పాలసీలు అన్నింటినీ కవర్ చేయకపోవడమే.

**కంటికి కనిపించని ఖర్చులు..**
ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పుడు బెడ్ చార్జీలు, డాక్టర్ ఫీజులు ఇన్సూరెన్స్ కంపెనీ కడుతుంది. కానీ కన్స్యూమబుల్స్ అంటే గ్లౌజులు, మాస్కులు, సర్జికల్ వస్తువులు, ప్రత్యేక డయాగ్నస్టిక్ టెస్టులు, రూమ్ రెంట్ క్యాపింగ్ వంటివి పాలసీహోల్డర్ల జేబుకు చిల్లు పెడతాయి. బిల్లులో ఇవి దాదాపు 5-15% వరకు ఉంటాయి. అంతేకాదు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక వాడే మందులు, ఫాలో-అప్ చెకప్‌ల ఖర్చును చాలా పాలసీలు భరించవు. ఇక్కడే మన మెడికల్ బ్యాకప్ ఫండ్ అండగా నిలుస్తుందన్నమాట.

**లిక్విడిటీ vs ప్రొటెక్షన్..**
ఇన్సూరెన్స్ అనేది కేవలం పెద్ద ఆసుపత్రి బిల్లుల నుంచి మాత్రమే రక్షణ కల్పిస్తుంది. కానీ అనారోగ్యం సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇంటి వద్ద రికవరీ కోసం అయ్యే ఖర్చులు, ప్రయాణ ఖర్చులకు ఇన్సూరెన్స్ పనికిరాదు. అందుకే ప్రతి కుటుంబం కనీసం 6 నుండి 12 నెలల ఖర్చులకు సరిపడా క్యాష్ 'లిక్విడ్ రిజర్వ్'గా పెట్టుకోవాలి. ఇది ఒక హెల్త్ ఎమర్జెన్సీ వల్ల మీ దీర్ఘకాలిక పెట్టుబడులు, డిపాజిట్లు, బంగారం లాంటి వాటిని అమ్ముకోకుండా కాపాడుతుంది.

**చేయాల్సిన 'మెడికల్ బ్యాకప్' ప్లాన్..**
మీ పాలసీ ఎంత ఉందో.. అందులో సుమారు 40-50% మొత్తాన్ని విడిగా ఒక మెడికల్ కంటింజెన్సీ ఫండ్‌గా దాచిపెట్టుకోవాలి. ఉదాహరణకు మీకు 10 లక్షల హెల్త్ పాలసీ ఉంటే.. ఒక 5 లక్షల రూపాయలను అత్యవసర నిధిగా పక్కన పెట్టడం మంచిది. ముఖ్యంగా వృద్ధులు, రిటైర్డ్ వ్యక్తులకు ఈ ఫండ్ కింద సేవింగ్స్ మరింత ఎక్కువగా ఉండాలి. హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ఆర్థిక రక్షణ కవచంలో ఫస్ట్ సేఫ్టీ నెట్ మాత్రమే. కానీ అది పూర్తి రక్షణ కాదు. ఆరోగ్య అత్యవసర స్థితి అనేది చెప్పి రాదు.. కానీ దానికి సిద్ధంగా ఉండటం మన చేతుల్లోనే ఉంది. ఇన్సూరెన్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తూ.. సమాంతరంగా ఒక ఎమర్జెన్సీ ఫండ్‌ను సిద్ధం చేసుకోవటం కీలకం.

## ట్రాఫిక్ కష్టాలకు చెక్: గాల్లో ఎగిరే ఎలక్ట్రిక్ టాక్సీలు.. రూ.8 వేల కోట్లు ఇన్వెస్ట్ చేసిన టయోటా




ట్రాఫిక్ కష్టాలకు ఇక కాలం చెల్లిపోనుంది. ఆకాశంలో ఎగిరే కార్లు అదేనండి ఎయిర్ టాక్సీలు త్వరలోనే మన ముందుకు రాబోతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా ఈ కలను సాకారం చేసే దిశగా అడుగు వేసింది. కాలిఫోర్నియాకు చెందిన ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీ స్టార్టప్ జాబీ ఏవియేషన్‌లో టయోటా ఏకంగా 900 మిలియన్ డాలర్ల భారీ పెట్టుబడిని ప్రకటించింది. మన భారతీయ కరెన్సీలో దీని విలువ సుమారు 8వేల కోట్ల రూపాయలకు పైమాటే. భవిష్యత్తు రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ఈ భారీ డీల్ జరిగింది.ఎయిర్ టాక్సీ ప్రత్యేకతలను గమనిస్తే.. ఇది ఆరు రోటర్లతో పనిచేసే పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ వాహనం. ఇది నిటారుగా టేకాఫ్ అవ్వడమే కాకుండా.. గాల్లో నిశ్శబ్దంగా ప్రయాణిస్తుంది. నగరాల్లో కిక్కిరిసిన ట్రాఫిక్‌లో గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా.. నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేర్చేస్తుంది. కేవలం పెట్టుబడి పెట్టడమే కాకుండా.. టయోటా తన తయారీ నైపుణ్యాన్ని కూడా ఈ స్టార్టప్‌కు అందిస్తోంది. దీనివల్ల జాబీ ఏవియేషన్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకోగలుగుతోంది. ప్రస్తుతం నెలకు ఒక ఎయిర్ టాక్సీని మాత్రమే తయారు చేస్తున్న ఈ సంస్థ.. టయోటా సహకారంతో 2027 నాటికి నెలకు నాలుగు ఎయిర్ టాక్సీలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. టయోటా ఇంజనీర్లు నేరుగా కాలిఫోర్నియాలోని తయారీ కేంద్రంలో పనిచేస్తూ.. ఉత్పత్తి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. రవాణా రంగంలో కేవలం రోడ్లకే పరిమితం కాకుండా.. మొబిలిటీ ఫర్ ఆల్ అనే నినాదంతో టయోటా ఆకాశ మార్గంలో కూడా కొత్త ట్రాన్స్‌పోర్ట్ టెక్నాలజీలకు ఊతం ఇస్తోంది.

పర్యావరణ హితమైన, శబ్దం లేని ఈ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలు అందుబాటులోకి వస్తే.. ఎయిర్ పోర్టులకు వెళ్లడం, ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రయాణించడం చాలా సులభతరం అవుతుంది. ఇప్పటికే పలు దేశాల్లో వీటి ట్రయల్స్ సక్సెస్ అయ్యాయి. రాబోయే 5 ఏళ్లలో ఆకాశంలో ఈ ఎయిర్ టాక్సీల సందడి పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. సాంకేతికత, పెట్టుబడి తోడైతే అసాధ్యం అనుకున్నది సుసాధ్యం అవుతుందని టయోటా మరోసారి నిరూపించింది. చూడాలి ఇండియాకి వీటి రాక ఎప్పుడు, అవి ఎంత వరకూ అందరికీ అందుబాటు రేట్లలోకి వస్తాయి అనే విషయాలు తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.


# ఈ పండ్లు తింటే కడుపులో అసిడిటీ పెరుగుతుందట!



కొన్ని పండ్లు అతిగా తినడం వల్ల కలిగే సమస్యల్లో ఆమ్లత్వం ఒకటి. నిజానికి ఇదొక సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. అయితే కొంతమంది ఆరోగ్యకరమైనవిగా భావించే పండ్లను తిలిసో తెలియక తినడం వల్ల చిక్కుల్లోపడతారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరగడానికి. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేస్తాయి. ఇందులో అతిగా తినడం వల్ల కలిగే సమస్యల్లో ఆమ్లత్వం ఒకటి. నిజానికి ఇదొక సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. అయితే కొంతమంది ఆరోగ్యకరమైనవిగా భావించే పండ్లను తిలిసో తెలియక తినడం వల్ల చిక్కుల్లోపడతారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరగడానికి బదులుగా హాని పెరుగుతుంది. నారింజ: ఆమ్లత్వం ఉన్నవారు నారింజ పండ్లను నివారించాలి. ఇవి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు అయినప్పటికీ వాటిలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. నారింజ తినడం వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్ పెరుగుతాయి.నిమ్మ: మీకు అసిడిటీ ఉంటే నిమ్మకాయను కూడా తీసుకోకూడదు. ఇందులో బలమైన గ్యాస్ట్రిక్ ఆమ్లం ఉంటుంది, ఇది ఆమ్లతను మరింత తీవ్రతరం చేస్తుంది, ముఖ్యంగా ఖాళీ కడుపుతో తీసుకుంటే. పైనాపిల్: అసిడిటీ సమస్య ఉన్నవారు పైనాపిల్ కూడా తినకూడదు. హెల్త్‌లైన్ ప్రకారం ఇందులో సిట్రిక్ యాసిడ్, బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటాయి. ఇది కడుపు ఆమ్లాన్ని పెంచుతుంది. గుండెల్లో మంటను కలిగిస్తుంది.మామిడి: ఆయుర్వేదం ప్రకారం పచ్చి మామిడి తినడం కూడా తీవ్ర అమ్లత్వాన్ని కలిగిస్తుంది. ఇందులో సిట్రిక్, మాలిక్, ఆక్సాలిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇవి పిత్తాన్ని తీవ్రతరం చేస్తాయి. ఇది గుండెల్లో మంట, ఆమ్లత్వానికి దారితీస్తుంది. జామ: జామపండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వాటిలో గట్టి విత్తనాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి అవి హానికరం. వీటి అజీర్ణం కారణంగా ఆమ్లతను మరింత తీవ్రతరం చేస్తాయి.ద్రాక్ష: ద్రాక్ష యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం.

వీటిని తీసుకోవడం వల్ల పిత్తం పెరుగుతుంది. వీటిలో అధిక మొత్తంలో సిట్రిక్, టార్టారిక్ ఆమ్లాలు ఉంటాయి. ఈ ఆమ్లాలు కడుపు ఆమ్లాన్ని మరింత పెంచుతాయి. ముఖ్యంగా ఖాళీ కడుపుతో వీటిపి తీసుకుంటే గుండెల్లో మంట వస్తుంది.

# లివర్ ఇన్ఫెక్షన్ ఎంత ప్రమాదమా!



కాలేయం (లివర్) ఇన్ఫెక్షన్ అనేది ఒక తీవ్రమైన సమస్య.. దీనిని తేలికగా తీసుకోకూడదు. సకాలంలో చికిత్స అందించాలంటే దాని లక్షణాల గురించి ఖచ్చితమైన అవగాహనం కలిగి ఉండటం ముఖ్యం.. లివర్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే.. పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. మన శరీరంలో అతి ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి.. లివర్ రక్తాన్ని శుద్ధి చేయడం, ఆహారాన్ని శక్తిగా మార్చడం, పిత్తాన్ని ఉత్పత్తి చేయడం.. శరీరం నుండి విషాన్ని తొలగించడం వంటి అనేక విధులను నిర్వహిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ ? జీవక్రియను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా పరాన్నజీవులు కాలేయంపై దాడి చేసినప్పుడు, ఇన్ఫెక్షన్ అభివృద్ధి చెందుతుంది. ఇవి హెపటైటిస్ వైరస్‌లు, కలుషితమైన ఆహారం లేదా నీరు, అధిక మద్యం సేవించడం, కొన్ని మందుల ప్రభావాలు, బలహీనమైన రోగనిరోధక శక్తి వల్ల సంభవించవచ్చు. రోగనిరోధక శక్తి బలహీనమైన వ్యక్తులు, ఇప్పటికే ఉన్న కాలేయ వ్యాధి ఉన్నవారు లేదా అసురక్షిత రక్తం లేదా ఏదైనా ఇంజెక్షన్ (జనిబజీటవ ఎనితీవఞబితినీనిబ ? అంటే సిరంజిలు, సూదులను ఒకరి కంటే ఎక్కువ మందికి తిరిగి ఉపయోగించడం) కు గురైన వారు కాలేయ ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరైన ఆహారం తీసుకోకపోవడం ? అనారోగ్యకరమైన జీవనశైలి కూడా ప్రమాదాన్ని పెంచుతాయి. అందువల్ల, కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. లేడీ హార్డింజ్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్, ఉూఆ డాక్టర్ ఎల్. హెచ్. ఘోటేకర్ వివరిస్తూ.. కాలేయ ఇన్ఫెక్షన్ వివిధ రకాల లక్షణాలను కలిగిస్తుందని వివరించారు. సాధారణ లక్షణాలలో అధిక లేదా తేలికపాటి జ్వరం, నిరంతర అలసట, బలహీనత, ఆకలి లేకపోవడం ఉంటాయి. కొంతమందికి కుడి ఎగువ ఉదరంలో నొప్పి లేదా భారంగా అనిపించవచ్చు. కామెర్లు కూడా వస్తాయి.. చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం జాండీస్ వ్యాధి ప్రధాన లక్షణం.. అని తెలిపారు. ముదురు రంగు మూత్రం ? తేలికపాటి మలం కూడా కాలేయ సమస్యను సూచిస్తాయి. వికారం, వాంతులు, శరీర నొప్పులు కూడా గమనించవచ్చు. లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగితే లేదా అకస్మాత్తుగా తీవ్రమైతే, అవి తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కావచ్చు. ఈ సంకేతాలను విస్మరించకపోవడమే మంచిది. కాలేయ ఇన్ఫెక్షన్లను నివారించడానికి, మంచి పరిశుభ్రతను పాటించండి. కలుషితమైన నీరు, ఆహారాన్ని నివారించండి. ఎల్లప్పుడూ తాజా, శుభ్రమైన ఆహారాన్ని తినండి. మద్యం వినియోగాన్ని పరిమితం చేయండి లేదా మానేయండి.


# వీటి ముందు మందులు కూడా పనికిరావు



ప్రతిరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వెల్లుల్లిని సహజ యాంటీబయాటిక్‌గా పోలుస్తారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. రక్తపోటును నియంత్రిస్తుంది.. ఒత్తిడిని తగ్గిస్తుంది.. శ్వాసకోశ సమస్యలకు ఉపశమనం అందిస్తుంది.. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో పోషకాలతోపాటు.. ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. ఆరోగ్యానికి అత్యంత మేలు చేసే సహజ సిద్ధమైన ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెబుతారు.. వెల్లులిలో ఉండే అల్లిసిన్, సల్ఫర్, జింక్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు, ఖనిజాలు దాగున్నాయి.. అందుకే.. వెల్లుల్లిని తరచుగా సహజ యాంటీబయాటిక్‌గా పోలుస్తారు. అందుకే.. ఉదయాన్నే రెండు వెల్లుల్లి రెబ్బలను తినాలని సూచిస్తారు. దీనివల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి గణనీయంగా మెరుగుపడుతుంది. వెల్లుల్లిలో అలిసిన్ అనే అమినో యాసిడ్, విటమిన్ సి, సెలీనియం వంటి ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి.. ఇవి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సాధారణ జలుబు, ఇతర శ్వాసకోశ సమస్యలకు వెల్లుల్లి ఒక ఔషధంలా పనిచేస్తుంది. ఆస్తమా, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది వంటి ఊపిరితిత్తుల రుగ్మతలను తగ్గించడంలో ఇది చక్కగా ఉపయోగపడుతుంది.వెల్లుల్లి రక్తనాళాల పనితీరును మెరుగుపరిచి, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి..

వెల్లుల్లి మధుమేహాన్ని నియంత్రించడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. మధుమేహగ్రస్తుల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. నోటి వ్యాధులకు కూడా వెల్లుల్లి సమర్థవంతంగా పనిచేస్తుంది.. దీనిలోని రసాయనాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రతిరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల ఒత్తిడి దూరమవుతుందని పరిశీలనలు సూచిస్తున్నాయి. అందుకే.. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. వెల్లుల్లిని తేనెతో లేదా.. నీటిలో మరిగించి తీసుకోవచ్చు.. టీలా తాగవచ్చు.. ఇంకా నేరుగా కూడా వెల్లుల్లి రెబ్బలను తీసుకోవచ్చు.. అయితే.. దీని వాసన.. రుచి ఘాటుగా ఉంటుంది.

# మిల్లెట్స్‌తో ఎలాంటి సమస్యలైనా పరారు?



మిల్లెట్స్ లో కొవ్వు నిల్వ చేయనివ్వదు. వీటిని తినడం వలన అధిక కొలెస్ట్రాల్, స్ట్రోక్స్ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఇంకా గుండె సమస్యలకు కూడా ఇది చెక్ పెడుతుంది. దీనిలో ఉండే పొటాషియం రక్తపోటును పెరగనివ్వకుండాతోడ్పడుతుంది. మిల్లెట్స్ ను చాలా మంది చిన్న చూపు చూస్తుంటారు. అయితే, ఇది ఇచ్చే శక్తి ఏది కూడా ఇవ్వదు. వీటిలో ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటితో ఎంతో మంది టిఫిన్స్ చేసుకుని తింటారు. ఇంకొందరు నార్మల్ గా తింటారు. అయితే, వీటిని ఎలా తిన్నా కూడా మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రాగులు, జొన్నలు, సజ్జలలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల బ్లడ్ లో షుగర్ లెవెల్స్ పెరగకుండా ఉంటాయి. మిల్లెట్స్ లో ఉండే కొన్ని పదార్థాలు ఇన్సులిన్ ను మెరుగుపరస్తుంది. ఇంకా బ్లడ్ లో షుగర్ లెవెల్స్ ను పెరగకుండా చూసుకుంటుంది. అలాగే, ఇది డయాబెటిస్‌కు సమస్యకు పూర్తిగా చెక్ పెడుతుంది. కాకపోతే మీరు దీనిని తినే ముందు వైద్యున్ని సంప్రదించి తాగడం మంచిదని అంటున్నారు. మిల్లెట్స్ లో ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం వంటివి ఎక్కువగా ఉంటాయి. మీరు వీటిని రెండు రోజులకొకసారి తింటే కడుపు నొప్పి, జీర్ణ సంబధిత సమస్యలు రాకుండా చేస్తాయి. కాబట్టి వీటిని అలవాటు చేసుకుని తినండి. మిల్లెట్స్ లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వలన ఇవి కడుపు నిండిన అనుభూతిని ఇస్తాయి. అధిక బరువుతో బాధ పడేవారు వీటిని మీ ఫుడ్ డైట్ లో చేర్చుకోండి. ఇవి బరువును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి, అధిక బరువు ఉన్న వారు ఉదయం, రాత్రి పూట తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మిల్లెట్స్ లో మెగ్నీషియం, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే గుండె సమస్యలతో ఇబ్బంది పడే వారు వీటిని తీసుకోవడం చాలా మంచిది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అంతేకాదు, బ్లడ్ ప్రెజర్ ను నియంత్రించడంలో మిల్లెట్స్ సహాయపడతాయి.

## గ్లాసుడు పాలు తాగితే సరిపడా కాల్షియం అందుతుందా?



చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ రోజూ ఏదో ఒక సమయంలో గ్లాసుడు పాలు తాగుతుంటారు. శరీర పెరుగుదల, బలానికి పాలు ఎంతో దోహదపడతాయి. జీవనశైలి, ఆహార అలవాట్లు మారుతున్నప్పటికీ పాలు ఇప్పటికీ పోషకాహార జాబితాలో టాప్ స్థానంలో ఉంది. పాలు ఆరోగ్యానికి మేలు చేయస్తాయన్న సంగతి తెలిసిందే. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ రోజూ ఏదో ఒక సమయంలో గ్లాసుడు పాలు తాగుతుంటారు. శరీర పెరుగుదల, బలానికి పాలు ఎంతో దోహదపడతాయి. జీవనశైలి, ఆహార అలవాట్లు మారుతున్నప్పటికీ పాలు ఇప్పటికీ పోషకాహార జాబితాలో టాప్ స్థానంలో ఉంది. ముఖ్యంగా ఎముకలు, దంతాల ఆరోగ్యం విషయానికి వస్తే మొదట గుర్తుకు వచ్చేది పాలు. కానీ ఇటీవలి కాలంలో కాల్షియం లోపానికి సంబంధించిన సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీని కారణంగా జనాలు తమ ఆహార అలవాట్లు గురించి మునుపటి కంటే ఎక్కువ అప్రమత్తంగా ఉంటున్నారు. లేడీ హార్డింగ్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎల్. హెచ్. ఘోటేకర్ మాట్లాడుతూ.. ఒక గ్లాసు పాలు తాగడం వల్ల శరీరానికి మంచి మొత్తంలో కాల్షియం లభిస్తుందని, ఇది శరీరం సులభంగా గ్రహించడానికి తోడ్పడుతుందని చెప్పారు. పాలలోని విటమిన్ డి శరీరంలోని కాల్షియం మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. అందుకే ఎముకలు, దంతాల బలానికి పాలు ప్రయోజనకరంగా ఉంటాయని చెబుతారు. కానీ ప్రతి ఒక్కరి శరీరంలో కాల్షియం అవసరం ఒకేలా ఉండదు. ఇది వయస్సు, లింగం, జీవనశైలి, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. శరీరంలో కాల్షియం తీవ్రంగా ఉంటే పాలు మాత్రమే తాగితే సరిపోదు. ఇలాంటి సందర్భాలలో పెరుగు, జున్ను, ఆకుపచ్చ కూరగాయలు, నువ్వులు, బాదం వంటి ఆహారాలను పాలతో పాటు తీసుకోవడం చాలా ముఖ్యం. ఇది శరీరానికి వివిధ వనరుల నుంచి కాల్షియం అందించడానికి సహాయపడుతుంది. మొత్తం మీద పాలు కాల్షియం లోపాన్ని అధిగమించడంలో సహాయపడతాయి. కానీ సమతుల్య ఆహారం లేకుండా కాల్షియం లోపాన్ని పూర్తిగా అధిగమించడం కష్టం. ఆరోగ్యవంతులైన పెద్దలు సాధారణంగా రోజుకు 2 గ్లాసులు లేదా 400 నుంచి 500 ఎశ్రీ పాలు తాగవచ్చు. ఇది రోజువారీ కాల్షియం అవసరాన్ని తీరుస్తుంది. పిల్లలు, గర్భిణీలు వారి అవసరాలకు అనుగుణంగా పాలతోపాటు ఇతర కాల్షియం అందించే ఆహారాలను తీసుకోవల్సి ఉంటుంది. లాక్టోస్ ఎలర్జీ ఉన్నవారు పాలు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. అవసరమైన దానికంటే ఎక్కువ పాలు తాగడం ప్రయోజనకరం కాదని మర్చిపోకూడదు. వీటన్నింటితో పాటు ప్రాసెస్ చేసిన ఆహారాలు, సోడా వినియోగాన్ని తగ్గించాలి.

## కొర్రలు వర్సెస్ గోధుమ రవ్వ.. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది బెటర్..!



కొర్రలు అధిక ఫైబర్, కాల్షియం, ఐరన్ కలిగి బరువు తగ్గింపు, మధుమేహ నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తాయి. గోధుమ రవ్వతో పోలిస్తే, కొర్రలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి. శక్తినిచ్చి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడే కొర్రలు సంపూర్ణ ఆరోగ్యానికి ఉత్తమమైన ఎంపిక. కొర్రలు ఫైబర్ ఎక్కువగా ఉండి ఎక్కువసేపు ఆకలి రాకుండా చేస్తాయి. కొర్రలు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ః కాంప్లెక్స్ వంటి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఎముకలు, రక్తం, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కొర్రలలో అధిక మొత్తంలో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాల బలాన్ని పెంచుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. గోధుమ రవ్వ శరీరానికి శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. డైట్ లక్ష్యాన్ని బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. శ్రమ ఎక్కువగా చేసే వారికి గోధుమ రవ్వ సరిపోతుంది. బరువు తగ్గే డైట్‌లో కొర్రలు ఐదు రెట్లు ఎక్కువగా పనిచేస్తాయి. బరువు తగ్గాలంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న కొర్రలు ఎక్కువగా ఉపయోగపడతాయి. కొర్రలు కడుపుకు తేలికగా జీర్ణమవుతాయి. కొర్రలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. ఎందుకంటే, ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి., అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయి. రక్తంలో షుగర్ లెవెల్స్ స్థిరంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తూ అలసట తగ్గుతుంది. కొన్ని రోజుల్లోనే గోధుమ రవ్వ రుచికి అలవాటు పడిపోతారు. కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గోధుమ రవ్వలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలుగుతుంది.కొర్రలలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది, ఇది రక్తహీనత (అనీమియా) నివారణకు సహాయపడుతుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. కొర్రలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు అమినో ఆమ్లాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి వృద్ధాప్య లక్షణాలను తగ్గించి, చర్మం ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తాయి.

## రోజుకో అరటిపండు తింటే.. శరీరంలో జరిగేది తెలిస్తే నోరెళ్లబెడతారు

తక్కువ ధరలో.. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే అరటిపండు తింటే డాక్టర్‌కు దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో, ముఖ్యంగా జీర్ణవ్యవస్థను కాపాడటంలో అరటిపండును మించిన పండు లేదని పరిశోధనల్లో తేలింది. అందుకే దీనిని పొట్టకు అమృతం అని పిలుస్తారు. పోషకాల గని: ఒక అరటిపండును కేవలం చిరుతిండిగా చూడకూడదు. ఇది పోషకాల పవర్‌హౌస్. ఒక సాధారణ పరిమాణంలో ఉండే అరటిపండు సుమారు 105 కేలరీల శక్తిని అందిస్తుంది. ఇందులో 1.29 గ్రాముల ప్రోటీన్, 3.07 గ్రాముల ఫైబర్ ఉండటంతో పాటు విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. ముఖ్యంగా ఇందులో ఉండే 88.4 గ్రాముల నీటి శాతం శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొవ్వు శాతం దాదాపు శూన్యం కావడంతో బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. జీర్ణవ్యవస్థకు ప్రాణవాయువు: అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే రెసిస్టెన్స్ స్టార్చ్, ప్రీబయోటిక్ ఫైబర్ పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా మారుతుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే యాంటీ అల్సర్ గుణాలు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గించడమే కాకుండా కడుపు లోపలి పొరను రక్షిస్తాయి. తద్వారా అల్సర్లు, మలబద్ధకం వంటి సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. రక్తపోటు నియంత్రణలో మేటి: ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవితంలో రక్తపోటు అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. అరటిపండులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తనాళాల మీద ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజూ ఒక అరటిపండు తింటే గుండె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా స్ట్రోక్ వంటి ప్రమాదాలు దరిచేరకుండా ఉంటాయి. తక్షణ శక్తి – ఒత్తిడి నివారణ: పని ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా వ్యాయామం చేసిన తర్వాత నీరసంగా అనిపిస్తే.. అరటిపండు ఒక ఇన్స్టంట్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఇందులో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తినిస్తాయి. అంతేకాకుండా దీనిలోని యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి.

# 6 ఏళ్ల తర్వాత తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్న స్మృతి మంధాన..



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన మరోసారి తన క్లాస్ బ్యాటింగ్ చూపించింది. ఈరోజు (ఫిబ్రవరి 21) అడిలైడ్ లోని ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో చెలరేగిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 176/6 అనే స్కోర్ చేయడంలో మంధాన కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు జెమిమాహ్ రోడ్రిగస్ తో కలిసి 82 బంతుల్లో 121 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జెమిమా (59) సైతం హాఫ్ సెంచరీ చేసింది.

ఈ ఇన్నింగ్స్‌తో స్మృతి మంధాన తన కెరీర్‌లో 33వ టీ20 అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసుకుంది. అంతేకాదు, ఆస్ట్రేలియాలో భారత బ్యాటర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన ప్లేయర్ గా ఆరేళ్ల రికార్డును కూడా చెరిపేసింది. గతంలో ఆమె 2020లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 37 బంతుల్లో 66 రన్స్ చేసింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి నయా చరిత్ర సృష్టించింది. ఇదే సమయంలో, ఆస్ట్రేలియాపై మంధానకు ఇది 8వ 50 ప్లస్ స్కోర్ కావడం విశేషం. ఈ విషయంలో కూడా ఆమె టీమిండియా బ్యాటర్‌గా నెంబర్ స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా తో జరిగిన మ్యాచ్ ప్రారంభంలో నాలుగో బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన స్మృతి, మూడో ఓవర్‌లో షఫాలి వర్మ (7) వికెట్ పడిన తర్వాత పవర్‌ప్లే చివరి ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ బౌలింగ్ లో మంధాన 3 ఫోర్లు కొట్టి బ్యాటింగ్ లో వేగం పెంచింది. జస్ట్ 38 బంతుల్లో

హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చి సెంచరీ దిశగా దూసుకెళ్లింది. చివరకు అన్నాబెల్ సదర్లాండ్ బౌలింగ్‌లో డీప్ మిడ్‌వికెట్ వద్ద క్యాచ్ ఇచ్చి అవుట్ అయింది. ఇక మంధాన – జెమిమా భాగస్వామ్యంతో భారత్ ఈ కీలక మ్యాచ్‌లో భారీ స్కోర్ సాధించగలిగింది.

# భారత్ ఘన విజయం.. 2--1 తేడాతో ఆస్ట్రేలియాపై సిరీస్ కైవసం



**హైదరాబాద్ పెన్ పవర్:** అడిలైడ్ లోని ఓవల్ స్టేడియంలో జరిగిన 3వ ౦20లో భారత్-- ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. నిర్ణయాత్మకమైన మ్యాచ్ లో 17 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి.. దీంతో సిరీస్ ని భారత్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ తీసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో భారత మహిళల జట్టు 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్లలో స్మృతి మంధాన (55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులు) హాఫ్ సెంచరీ చేయగా, జెమిమా రోడ్రిగ్స్ (59) కూడా అర్ధ శతకంలో టీం భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో 177 పరుగుల టార్గెట్ తో బరిలో దిగిన ఆస్ట్రేలియాను 159/9 పరుగులకే టీమిండియా బౌలర్లు పరిమితం చేశారు. ఆష్లీ గార్డనర్ 57 హాఫ్ సెంచరీ చేయగా, లిచ్ఫీల్డ్ 26 దూకుడుగా ఆడినప్పటికీ ఆసీస్ ను మాత్రం గెలిపించడంలో విఫలమయ్యారు. వీరు ఇద్దరు మినహా మిగతా అందరూ బ్యాటర్లు తక్కువ పరుగులకే ఔట్ కావడంతో భారత్ ఈజీగా విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో శ్రీచరణి, శ్రేయాంక తలో 3 వికెట్లు, అరుంధతి రెడ్డి 2 వికెట్లు, రేణుక సింగ్ ఒక వికెట్ తీసుకుంది. ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత్ ఘన విజయం సాధించడంతో పాటు ఈ సిరీస్ ని కైవసం చేసుకుంది. దీంతో ఆసీస్ గడ్డపై భారత్ మహిళల జట్టుకు ఇదే తొలి సిరీస్ విజయం. మ్యాచ్ అనంతరం భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఈ సిరీస్ విజయంపై ఆనందంగా ఉంది. ఈ విజయం మాకు చాలా ప్రత్యేకమైనది.. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్.. ప్రతి ఒక్కరూ జట్టుకు ఏదో ఒక విధంగా సహకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. జెమిమా రోడ్రిగ్స్, స్మృతి మంధాన భాగస్వామ్యంపై సరైన సమయంలో వచ్చింది.. వారు ఇద్దరు జట్టుకు వారు పెద్ద బలంగా మారారు అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. ఇక మేం వికెట్లు తీసినప్పుడే మ్యాచ్ మన వైపు తిరుగుతుంది.. ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టు వికెట్లు తీయడం అంత సులభం కాదు.. కానీ మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్ల పడగొట్టడంతో ఈ మ్యాచ్ గెలిచామని వెల్లడించింది. భారత్ చేతిలో ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ మాట్లాడుతూ.. మంచి వికెట్‌పై టీమిండియాను కట్టడి చేశాం.. కానీ కీలక సమయంలో వికెట్లు కోల్పోవడమే మాకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపింది. పెర్రీ కోసం ఈ మ్యాచ్ గెలవలేకపోయినందుకు కొంచెం బాధగా ఉంది.. ఆమె మాకు అందరికీ పెద్ద ఇన్స్పిరేషన్.. ఆమె మరెన్నో మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటున్నాం పేర్కొనింది. వచ్చే వన్డే సిరీస్‌లో అలీసా హీలీ జట్టులోకి రావడం మాకు పెద్ద ప్లస్ అవుతుంది.. ఆ సిరీస్‌లో పరిస్థితిని మార్చేందుకు మా వంతు ప్రయత్నం చేస్తామని సోఫీ మోలినెక్స్ చెప్పుకొచ్చింది.

# అభిషేక్ శర్మ ఫామ్ గురించి టెన్షన్ వద్దు.. సూర్యకుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026లో అభిషేక్ శర్మ టాప్ రన్‌గెటర్‌గా నిలుస్తాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. కానీ టోర్నీ ఆరంభంలోనే అభిషేక్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతని ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గట్టిగా స్పందించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన స్కై, అభిషేక్ ప్రస్తుత ఫామ్ తనను ఏమాత్రం ఆందోళనకు గురి చేయడం లేదని స్పష్టం చేశాడు. అంతేకాదు, అతడిపై విమర్శలు చేసే వారిపైనే తనకు ఎక్కువ టెన్షన్‌గా ఉందని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ గురించి ఆందోళన చెందుతున్న వాళ్ల గురించి నేనే ఎక్కువగా ఆందోళన పడుతున్నాను అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. అతడు తర్వాత ఆడే జట్ల పరిస్థితి ఏంటో ఆలోచించాలి అని పేర్కొన్నాడు. గత ఏడాది అభిషేక్ జట్టు కోసం అన్నీ చేశాడు.. ఇప్పుడు మేము అతడికి మద్దతుగా నిలిచే సమయం వచ్చింది అని స్పష్టం చేశాడు. కాగా అభిషేక్ శర్మ సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉంది.. అతడు త్వరలోనే తన గత ఫామ్‌ను తిరిగి అందుకుంటాడని స్కై భాయ్ ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో సూర్యకుమార్ మాటలు ప్రత్యర్థి జట్లకు ఇది ఒక హెచ్చరికగా మారిందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభిషేక్ ఒక్కసారి ఫామ్‌లోకి వస్తే, ప్రత్యర్థి బౌలర్లకు కష్టకాలమేనన్న సందేశాన్ని సూర్య వ్యాఖ్యలతో క్లియర్ గా తెలిసిపోతుంది. వరుసగా విఫలమైతున్నప్పటికీ అభిషేక్ శర్మకు తుది జట్టులో స్థానం కొనసాగుతుందని బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తెలిపారు. జట్టు మేనేజ్‌మెంట్‌లో అభిషేక్ ప్రదర్శనపై ఎలాంటి చర్చే జరగడం లేదని స్పష్టం చేశారు. అతను వరల్డ్ క్లాస్ ప్లేయర్, ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకుని నిలబడ్డారు.. ఇప్పుడు వరల్డ్ కప్‌లో చాలా కీలక దశకు చేరుకున్నాం.. ఈ సమయంలో అభిషేక్ తప్పకుండా రాణిస్తాడనే నమ్మకం మాకు ఉందని మోర్నీ మోర్కెల్ ధీమా వ్యక్తం చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో భాగంగా రేపు (ఫిబ్రవరి 22న) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

ప్రగ్యా జైస్వాల్: ఎ విజన్ ఇన్ గోల్డెన్ గ్లో



# సిద్ధు, నవీన్‌ల దారిలో రామ్...!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ గత కొన్నాళ్లుగా సక్సెస్ కోసం చేయని ప్రయత్నం లేదు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఆ స్థాయి విజయం రామ్ చూడలేదు. గత నాలుగు ఐదేళ్లుగా రామ్ చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ కావడం లేదు. గత ఏడాది 'ఆంధ్రా కింగ్ తాలూక' సినిమాతో రామ్ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. రివ్యూలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. రామ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. దర్శకుడి యొక్క పనితనం కి కూడా మంచి మార్కులు పడ్డాయి. స్క్రీన్ ప్లే బాగుందని అంతా మెచ్చుకున్నారు. కానీ సినిమాకు కలెక్షన్స్ మాత్రం రాలేదు. చాలా మంది ఓటీటీలో సినిమాను చూసి వావ్ అన్నారు కానీ, థియేట్రికల్ రన్ సమయంలో మాత్రం అటువైపు వెళ్లలేదు. సినిమాకు ఎంత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినా ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేద్దాం అన్నట్లుగానే ఉన్నారు.

**రామ్ ఆంధ్రా కింగ్ తాలూక సినిమా...**

ఆంధ్రా కింగ్ తాలూక సినిమా తర్వాత రామ్ సన్నిహితుల వద్ద చాలా ఆవేదన వ్యక్తం చేశాడని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఆ సినిమా తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న రామ్ తిరిగి కొత్త సినిమా పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం తనకు నమ్మకస్తుడు అయిన దర్శకుడు కిషోర్ తిరుమల వద్ద రామ్ ఒక కథను తీసుకున్నాడట. ఆ కథ తో పాటు మరో కథను రామ్ ఇప్పుడు డెవలప్ చేసే పనిలో ఉన్నాడు. రెండు కథల పై వర్క్ జరుగుతోంది. రామ్ కి ఒక రైటింగ్ టీమ్ ఉంటుంది. ఆ టీమ్ ఇప్పుడు ఆ రెండు కథలను ఫైనల్ చేసే విధంగా సిట్టింగ్స్ లో ఉన్నారు. ఇక్కడ చెప్పుకోవద్ద విషయం ఏంటంటే కథ చర్చల్లో రామ్ ప్రధానంగా పాల్గొంటున్నాడు. అధికారికంగా ఈ సినిమా కు రామ్ రైటర్ గా వ్యవహరించబోతున్నట్లుగా ఆయన సన్నిహితులు, మీడియా సర్కిల్స్ వారి ద్వారా సమాచారం అందుతోంది.

**సిద్ధుజొన్నలగడ్డ, నవీన్ పొలిశెట్టి....**

ఇప్పటికే నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోలు కథ విషయంలో చాలా ఇన్వాల్వ్ అవుతారు. అంతే కాకుండా రైటింగ్ విషయంలో ఇద్దరు హీరోలు పూర్తి ఇన్వాల్వ్‌మెంట్ అవుతారని టాక్ ఉంది. టైటిల్ కార్డ్ పడకున్నా దర్శకత్వం సైతం ఈ హీరోలు చేస్తారు అనే టాక్ ఉంది. ఆ విషయం పక్కన పెడితే ఇప్పుడు రామ్ కూడా రైటింగ్ పై పూర్తి ఫోకస్ పెట్టాడని తెలుస్తోంది. చాలా సినిమాలు చేసిన అనుభవం ఉన్న రామ్ కి రైటింగ్ పై పట్టు ఉండటం చాలా కామన్ విషయం. అయితే పూర్తి ఇన్వాల్వ్‌మెంట్‌తో రైటింగ్ పై దృష్టి పెట్టడం ఎంతవరకు సాధ్యం అని కొందరు భావిస్తున్నారు. సినిమా షూటింగ్‌కి ముందు స్క్రిప్ట్ విషయంలో రామ్ ఇన్వాల్వ్‌మెంట్ ఉంటే మేకింగ్ సమయంలోనూ ఆయన ఇన్వాల్వ్‌మెంట్ ఉండే అవకాశం ఉంటుందని కొందరు అంటున్నారు. ఇప్పటి వరకు రామ్ తదుపరి సినిమా దర్శకుడు ఎవరు అనే విషయం లో క్లారిటీ రాలేదు.

**రామ్ నిర్మాణంలో కొత్త సినిమా...**

నవీన్, సిద్ధు సినిమాలకు దర్శకులు కొత్త వారు పని చేస్తారు. దాంతో వీరి ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువగా ఉంటుందని అంటారు. అందుకే రామ్ సైతం తన తదుపరి సినిమాకి కొత్త దర్శకుడిని తీసుకుంటే అన్ని విధాలుగా బాగుంటుంది అనేది ఆయన కాంపౌండ్ ఆలోచనగా తెలుస్తోంది. కేవలం రైటింగ్ విషయంలోనే కాకుండా నిర్మాణంలోనూ రామ్ పాత్ర ఉండే అవకాశాలు ఉన్నాయి. తన సొంత బ్యానర్‌లో రామ్ ఈ సినిమాను నిర్మించే యోచన చేస్తున్నాడని తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక నిర్మాతలు ఎవరూ సెట్ కాకుంటే అప్పుడు రామ్ సొంతంగా రంగంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. మొత్తానికి రామ్ ఈసారి సొంత ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరి ఈ ప్రయోగం ఎంతవరకు సఫలం అవుతుంది అనేది చూడాలి. రామ్ గత చిత్రాల ఫలితాలు కచ్చితంగా రాబోయే సినిమాపై ఉంటుంది. దాన్ని అధిగమించే విధంగా ఈ సినిమా ఉండాలి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.



నేహా శర్మ యొక్క బ్లాక్ మ్యాజిక్: స్వచ్ఛమైన చక్కదనం యొక్క విజన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965